http://www.agnidharanews.com

# అగ్నిధార

శనివారం 11 జనవరి 2025

నిజాల నిప్పు కణిక

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.
ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828




## అ నోట్లు ఎక్కడ?

- మిస్టరీగా మారిన రూ.6,700 కోట్లు..
- ఇప్పటికీ తిరిగి రాని నోట్లు..
- రూ.2000 నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించి ఏడాదిన్నర దాటింది.
- భారతదేశంలోని అన్ని బ్యాంకు శాఖలలో రూ.2000 నోట్లను డిపాజిట్ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశం
- 2024 నాటికి రూ.6,691 కోట్లకు తగ్గిందని ఆర్‌బీఐ అధికారిక గణాంకాలు

## అద్భుతాలు చేసే వారు
# మాతో రండి

- రాష్ట్రాన్ని రైజింగ్ తెలంగాణగా చేయడమే తమ లక్ష్యం
- హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీని నిర్మించాలన్నది ప్రభుత్వ ఆలోచన
- హైటెక్ సిటీలో సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశం
- చైనా తరహాలో క్లస్టర్లు ఏర్పాటు చేస్తాం
- అవుటర్ రింగ్ రోడ్డు-రీజనల్ రింగ్ రోడ్డు మధ్య రేడియల్ రోడ్లు నిర్మిస్తాం



హైదరాబాద్

పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వంతో కలిసి కంపెనీలు ముందుకు వస్తే అద్భుతాలు చేయవచ్చన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. రాష్ట్రాన్ని రైజింగ్ తెలంగాణగా చేయడమే తమ లక్ష్యమన్నారు. హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీని నిర్మించాలన్నది ప్రభుత్వ ఆలోచనగా చెప్పుకొచ్చారు. శుక్రవారం హైటెక్ సిటీలో సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక విషయాలు వెల్లడించారు. హైదరాబాద్‌ను కాలుష్య రహితంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఈ క్రమంలో ఈవీ బస్సులను ఆర్టీసీలో ప్రవేశపెట్టామన్నారు. ఆయా వాహనాలకు రిజిస్ట్రేషన్, రోడ్డు ట్యాక్స్ తొలగించామని వివరించారు. హైదరాబాద్ సిటీని వరదలు లేని నగరంగా తీర్చి దిద్దాలన్నదే తమ ఆలోచనగా చెప్పుకొచ్చారు - మిగతా3లో



## ఎమ్మెల్సీ స్థానాలకు బీజేపీ అభ్యర్థుల ప్రకటన

- నల్లగొండ - వరంగల్ - ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థిగా పులి సరోత్తమ్ రెడ్డి
- కరీంనగర్ - నిజామాబాద్ - ఆదిలాబాద్ - మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థిగా మల్కా కొమరయ్య
- కరీంనగర్ -నిజామాబాద్ -ఆదిలాబాద్ - మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సి అంజిరెడ్డి

హైదరాబాద్

తెలంగాణలో త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన అభ్యర్థులను బీజేపీ ప్రకటించింది. రెండు టీచర్, ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థులను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించారు. నల్లగొండ - వరంగల్ - ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థిగా పులి సరోత్తమ్ రెడ్డి, కరీంనగర్ - నిజామాబాద్ - మిగతా3లో

## ప్రత్యేక ప్రదర్శనల అనుమతిపై
# హైకోర్టు అసంతృప్తి




- ఆ షోలు రద్దు చేశామంటూ మళ్లీ ఏంటిది..
- బెనిఫిట్ షోలు రద్దు చేశామంటూ పరోక్షంగా ప్రత్యేక షోలకు అనుమతి ఇవ్వడమేంటి
- ఇకపై బెన్‌ఫిట్‌షోలకు అనుమతించేది లేదని స్పష్టం
- అర్ధరాత్రి ఒంటి గంట దాటిన తర్వాత తెల్లవారుజామున షోలకు అనుమతి ఇవ్వడంపై పునసమీక్షించాలి
- హెూంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఆదేశించిన హైకోర్టు

హైదరాబాద్

గేమ్ ఛేంజర్ సినిమా టికెట్ల ధరలు, ప్రత్యేక ప్రదర్శనలపై తెలంగాణ హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. ప్రత్యేక ప్రదర్శనల అనుమతిపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. బెనిఫిట్ షోలు రద్దు చేశామంటూ పరోక్షంగా ప్రత్యేక షోలకు అనుమతి ఇవ్వడమేంటని న్యాయస్థానం ప్రశ్నించింది. అర్ధరాత్రి ఒంటి గంట దాటిన తర్వాత తెల్లవారుజామున షోలకు అనుమతి ఇవ్వడంపై పునసమీక్షించాలని హెూంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఆదేశించిన హైకోర్టు తదుపరి విచారణను - మిగతా3లో



## మహారాష్ట్రలో బీజేపీ విజయానికి
# ఆర్ఎస్ఎస్ ప్రధాన కారణం

- గత ఏడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడానికి ఆర్ఎస్ఎస్ పని విధానం, దాని దూకుడు
- హిందూత్వ ప్రచారం వంటివి కీలక స్తంభాలు
- అందుకే 149 స్థానాల్లో పోటీ చేసిన బీజేపీ 132 సీట్లు గెలుచుకున్నది
- శరద్ పవార్ ప్రశంస

# టార్గెట్ కేసీఆర్...
## రేవంత్ వ్యూహం అదేనా?

హైదరాబాద్

తెలంగాణలో ఎన్నికలు ముగిసి ఏడాది గడిచినా.. అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం ఆగడం లేదు. సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై కమిషన్ వేవారు. తర్వాత విద్యుత్ కొనుగోలు ఒప్పందంపైనా విచారణ కమిషన్‌ను నియమించారు. ఇదే సమయంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం వెలుగు చూసింది. వీటితో రేవంత్ సర్కార్ కేసీఆర్‌తోపాటు కేటీఆర్, హరీశ్‌రావును ఇరుకున - మిగతా3లో





## ఎక్కువ రేటుకు టిక్కెట్లు అమ్మితే...
# తాట తీస్తాం

- తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- ఇష్టారాజ్యంగా టికెట్ రేట్లు పెంచేసి.. ప్రయాణికుల్ని గుల్ల చేస్తుంటారు.
- అధిక ధరలకు బస్సు టికెట్లు విక్రయించినట్లు తెలిస్తే.. ఆయా బస్సుల్ని సీజ్ చేస్తామంటూ హెచ్చరికలు
- తెలంగాణ ఆర్టీసీ ప్రజల సౌకర్యార్థం ఏకంగా.. 6,432 ప్రత్యేక బస్సులను టీజీఆర్టీసీ నడపేందుకు నిర్ణయం

హైదరాబాద్

సంక్రాతి వచ్చిందంటే.. బస్సులు, ప్రైవేట్ ట్రావెల్స్ హడావిడి ఏ తీరుగా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అవకాశం వచ్చింది కదా అని అందిన కాడికి దండుకునేందు సిద్ధమైపోతుంటారు. ఇష్టారాజ్యంగా టికెట్ రేట్లు పెంచేసి.. ప్రయాణికుల్ని గుల్ల చేస్తుంటారు. కానీ.. ఇకపై అలా వీలు కాదంటున్నారు? తెలంగాణ రవాణా, బీసీ - మిగతా3లో



## ఈ నెల 28 దాకా హరీశ్‌రావును అరెస్టు చేయొద్దు
### హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు పొడిగింపు

హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్‌రావును అరెస్టు చేయవద్దన్న మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టును పొడిగించింది. రియల్ ఎస్టేట్ వ్యాపారి గాదగోని చక్రధర్ గౌడ్ ఫిర్యాదు మేరకు నమోదైన కేసుపై తాజాగా హైకోర్టు విచారణ చేపట్టింది. కౌంటర్ దాఖలు చేయాలని చక్రధర్ గౌడ్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 28వ తేదీకి వాయిదా వేసింది. అప్పటివరకు హరీశ్‌రావును అరెస్టు చేయవద్దనే ఉత్తర్వులను పొడిగించింది. హరీశ్‌రావు మంత్రిగా ఉన్న సమయంలో తన ఫోన్ ట్యాపింగ్ చేశారని, తనపై బెదిరింపులకు పాల్పడ్డారని గత నెల 1వ తేదీన సిద్దిపేటకు చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి, కాంగ్రెస్ నేత గాదగోని చక్రధర్ గౌడ్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో 120(బీ), 386, 409, 506ఆర్/డబ్ల్యూ, 34ఐపీసీ, 66 ఐటీ యాక్ట్ ప్రకారం హరీశ్‌రావుపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని, తనను అరెస్టు చేయకుండా ఆదేశాలివ్వాలని హరీశ్‌రావు అప్పట్లో హైకోర్టును ఆశ్రయించారు. హరీశ్‌రావు పిటిషన్‌పై గతంలో విచారణ చేపట్టిన హైకోర్టు.. ఆయన్ను అరెస్టు చేయరాదని పోలీసులను ఆదేశించింది. హరీశ్‌రావుపై ఎటువంటి కఠిన చర్యలు తీసుకోరాదని కూడా పంజాగుట్ట పోలీసులకు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది.

# భారత కూటమిలో బీటలు

**న్యూఢిల్లీ :** భారత కూటమిలో వచ్చిన బీటలు ఇప్పుడిప్పుడే బయటపడ్డాయి. ఆర్జేడీ నాయకుడు తేజస్వి యాదవ్ తర్వాత, ఇప్పుడు నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు, జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఇండియా బ్లాక్ ఉనికి గురించి ప్రశ్నలు లేవనెత్తారు. ఇందులో ఎజెండా లేదా నాయకత్వం లేదని ఒమర్ అబ్దుల్లా అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూటమి సభ్యులందరినీ సమావేశానికి పిలవాలని ఆయన అన్నారు. ఈ కూటమి లోక్‌సభ ఎన్నికలకే పరిమితమైతే దానిని త్వరలో ముగించాలన్నారు. కానీ అది అసెంబ్లీ ఎన్నికలు కూడా అయితే, మనం కలిసి కూర్చుని కలిసి పనిచేయాల్సి ఉంటుందని అబ్దుల్లా ఇక్కడ విలేకరులతో అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఇండియా బ్లాక్‌లో చీలిక తెరపైకి వచ్చింది. సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్, ఎన్‌సిపి సహా అనేక పార్టీలు కాంగ్రెస్‌ను దాటవేసి ఆప్‌కు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించాయి. ఇండియా బ్లాక్ ఉనికి గురించి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇండియా బ్లాక్ లోక్‌సభ ఎన్నికలకు మాత్రమే అని ఆర్జేడీ నాయకుడు తేజస్వి యాదవ్ చేసిన ప్రకటనపై స్పందిస్తూ, తనకు గుర్తున్నంత వరకు దానికి ఎటువంటి కాలపరిమితి నిర్ణయించబడలేదని నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు అన్నారు. సమస్య ఏమిటంటే ఇండియా బ్లాక్ సమావేశాన్ని పిలవలేదు. ప్రధాన నాయకత్వం, పార్టీ లేదా భవిష్యత్తు వ్యూహం (ఇండియా బ్లాక్‌లో) ఎజెండా గురించి స్పష్టత లేదని ఆయన పేర్కొన్నారు. పొత్తు కొనసాగుతుందా లేదా అనేది కూడా స్పష్టంగా లేదు. బహుశా ఢిల్లీ ఎన్నికల తర్వాత, ఇండియా బ్లాక్ సభ్యులను సమావేశానికి పిలిపించి, అప్పుడు పరిస్థితి స్పష్టమవుతుందని అబ్దుల్లా అన్నారు. వచ్చే నెలలో జరగనున్న ఢిల్లీ ఎన్నికలకు ముందు ఆప్ కు పెరుగుతున్న మద్దతు గురించి మరొక ప్రశ్నకు సమాధానమిస్తూ, "ఢిల్లీ ఎన్నికలతో మాకు ఎటువంటి సంబంధం లేదు కాబట్టి నేను ఇప్పుడే దాని గురించి ఏమీ చెప్పలేను" అని అబ్దుల్లా అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్, ఇతర రాజకీయ పార్టీలు బిజెపిని ఎలా బలంగా ఎదుర్కోవాలో నిర్ణయిస్తాయి. గతంలో కూడా ఢిల్లీలో ఆప్ రెండుసార్లు విజయం సాధించిందని అబ్దుల్లా పేర్కొంటూ, "ఈసారి ఢిల్లీ ప్రజలు ఏమి నిర్ణయిస్తారో వేచి చూడాలి" అని అన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో



ఇండియా అలయన్స్ ఓటమి తర్వాత, ఇండియా అలయన్స్ ఉనికి గురించి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నాయకత్వం గురించి ప్రశ్న లేవనెత్తుతూ ఇండియా బ్లాక్‌కు నాయకత్వం వహించడానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఆ తర్వాతే ఇండియా బ్లాక్ గురించి చర్చ మొదలైంది.

**మోడీ చెప్పినట్టుగానే...**

ఇండియా కూటమికి బీటలు వారాయి అని వార్తలు వస్తున్న నేపథ్యంలో.. జమ్ము కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇండియా కూటమిలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహార సాగుతోందని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల వరకే ఇండియా కూటమి అని అనుకుంటే తప్పనిసరిగా దాని మూసివేయాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి వ్యూహాలు రచించకపోవడం.. ఒకవేళ అవి రచించినా అమల్లో పెట్టకపోవడం అత్యంత దారుణమని పేర్కొన్నారు. మరోవైపు రాష్ట్రీయ జనతా నేత తేజస్వి యాదవ్ ఇండియా కూటమిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కేవలం పార్లమెంటు ఎన్నికల వరకే ఇండియా కూటమి ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. పార్టీలు తమ అవసరాల దృష్ట్యా స్థానిక ఎన్నికల్లో పోటీ చేయవచ్చని పేర్కొన్నారు. కలిసి పోటీ చేయాలని సందర్భం వచ్చినప్పుడు.. ఒంటరిగానే ఎన్నికల బరిలో ఉండి.. తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవచ్చని పేర్కొన్నారు. తేజస్వి యాదవ్ ఈ వ్యాఖ్యలు చేయడంతో? జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. " ఇండియా కూటమికి బీటలు వారాయి. ఇకపై ఆ కూటమి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేదు. ఈ లెక్కన చూస్తే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలు నిజమవుతున్నాయి. ఇవే గనుక మునుముందు కొనసాగితే దేశంలో బలమైన ప్రతిపక్షం అంటూ ఉండదు. మోడీ ఆడుతున్న గేమ్లో ఇండియా కూటమి చిక్కి విలవిలలాడిపోవడం అత్యంత దారుణమని" రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## మహారాష్ట్రలో బీజేపీ విజయానికి ఆర్ఎస్ఎస్ ప్రధాన కారణం..



ముంబై: ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)ను ఆయన ప్రశంసించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అనూహ్య విజయానికి ఆ సంస్థ ప్రధాన కారణమని అన్నారు. ముంబైలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి శరద్ పవార్ మాట్లాడారు. గత ఏడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడానికి ఆర్ఎస్ఎస్ పని విధానం, దాని దూకుడు, హిందూత్వ ప్రచారం వంటివి కీలక స్తంభాలని తెలిపారు. అందుకే 149 స్థానాల్లో పోటీ చేసిన బీజేపీ 132 సీట్లు గెలుచుకున్నదని అన్నారు. కాగా, అంకితభావంతో పనిచేసే ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు బీజేపీ విజయానికి ఒక ఉదాహరణ అని శరద్ పవార్ తెలిపారు. అట్టడుగుస్థాయి వరకు ఆ సంస్థ కీలకంగా పని చేసిందని ఆయన కొనియాడారు. 17 కొత్త కార్పొరేషన్ల ఏర్పాటు, ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) ఓటు బ్యాంకు విశ్వాసాన్ని బీజేపీ తిరిగి పొందడం కూడా ఎన్డీయే విజయానికి కారణాలని అన్నారు.

## అ నోట్లు ఎక్కడ?




రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.2000 నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించి ఏడాదిన్నర దాటింది. అయితే 1.88 శాతం కరెన్సీ నోట్లు ఇంకా వెనక్కి రాలేదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనవరి 1, 2025న అధికారికంగా ప్రకటించింది. ఆర్‌బీఐ డేటా ప్రకారం, తిరిగి రాని కరెన్సీ నోట్లు రూ.6,691 కోట్లు ఉందని తెలిపింది. 2023లో రూ.2 వేల నోట్లను వెనక్కి తీసుకున్నారు. తదనంతరం, భారతదేశంలోని అన్ని బ్యాంకు శాఖలలో రూ.2000 నోట్లను డిపాజిట్ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. దీని ప్రకారం ప్రజలు తమ వద్ద ఉన్న రూ.2 వేల నోట్లను బ్యాంకులతో పాటు ప్రభుత్వ ఆమోదం పొందిన స్థలాల్లో డిపాజిట్ చేశారు. ఈ పథకం చెలామణిలో ఉన్నప్పుడు మొత్తం రూ.2000 నోట్ల విలువ రూ.3.56 లక్షల కోట్లు. ఇది డిసెంబర్ 31, 2024 నాటికి రూ.6,691 కోట్లకు తగ్గిందని ఆర్‌బీఐ అధికారిక గణాంకాలు తెలిపాయి. అంటే చెలామణిలో ఉన్న రూ.2000 నోట్లలో 98.12 శాతం తిరిగి వచ్చినట్లు ఆర్బీఐ ప్రకటించింది. దానికి సంబంధించి రూ.2 వేల నోట్లలో 1.88 శాతం తిరిగి రాలేదు. ఆర్‌బీఐ అధికారిక గణాంకాల ప్రకారం దీని విలువ రూ.6,691 కోట్లు.

**ప్రింటింగ్ నిలిపివేత**

గతంలో 2018-19లో రూ.2 వేల నోట్ల ముద్రణ నిలిచిపోయింది. అంటే రూ.1000, రూ.500 నోట్ల రద్దు తర్వాత ప్రజలకు డబ్బులు అందడంలో ఇబ్బంది ఏర్పడింది. ఈ క్రమంలోనే రూ.2 వేల నోట్లను ప్రవేశపెట్టారు. ఈ లక్ష్యం నెరవేరిన తర్వాత రూ.2వేల నోట్ల ముద్రణ నిలిపివేసింది.

## కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి గుడ్ న్యూస్.. బెయిల్ మంజూరు



హిందూత్వ సిద్ధాంతకర్త వీడీ సావర్కర్‌పై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై దాఖలైన పరువు నష్టం కేసులో కాంగ్రెస్ నేత, ఎంపీ రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ఈ క్రమంలో పూణేలోని ప్రత్యేక కోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ముందు హాజరైన తర్వాత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌కు రూ.25,000 పూచీకత్తుపై కోర్టు బెయిల్ మంజూరు చేసింది. సీనియర్ కాంగ్రెస్ నేత మోహన్ జోషి కోర్టులో పూచీకత్తుగా హాజరయ్యారు. కాంగ్రెస్ నాయకుడికి కోర్టు ముందు హాజరు కావడానికి శాశ్వత మినహాయింపు ఇచ్చిందని గాంధీ తరపున వాదించిన న్యాయవాది మిలింద్ పవార్ అన్నారు. ఈ కేసు తదుపరి విచారణ ఫిబ్రవరి 18న జరుగుతుందని పవార్ తెలిపారు. సావర్కర్ మనవడు ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. మార్చి 2023లో లండన్‌లో గాంధీ చేసిన ప్రసంగానికి సంబంధించినది. రాహుల్ తన ప్రసంగంలో స్వాతంత్ర్య సమరయోధుడు రాసిన పుస్తకం గురించి కొన్ని వ్యాఖ్యలు చేశారు.

## దేశ నిర్మాణమే మా ప్రధాన లక్ష్యం..

### చైర్మన్ వ్యాఖ్యలపై వివరణ ఇచ్చిన ఎల్ అండ్ టీ సంస్థ



ఉద్యోగులు వారానికి 90 గంటల పాటు పని చేయాలని ఆదివారాలు సైతం కార్యాలయాలకు వెళ్లాలని ఎల్అండ్‌టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు చర్చకు దారి తీస్తున్నాయి. ముఖ్యంగా 'ఎప్పుడూ ఇంట్లోనే ఉంటూ ఏం చేస్తారు..? ఎంతసేపని భార్య ముఖం తదేకంగా చూడగలరు? ' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఆయన వ్యాఖ్యలపై నెట్టింట తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పలువురు సెలబ్రిటీలు సైతం ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎల్ అండ్ టీ చైర్మన్ చేసిన వ్యాఖ్యలపై కంపెనీ స్పష్టతనిచ్చింది. దేశ నిర్మాణమే తమ సంస్థ ప్రధాన లక్ష్యం అని పేర్కొంది. గత ఎనిమిది దశాబ్దాలకు పైగా భారతదేశ మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, సాంకేతిక సామర్థ్యాలను ఎల్ అండ్ టీ మెరుగుపరిచిందని వివరించింది. అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే క్రమంలో అసాధారణ ఫలితాలు సాధించాలంటే అసాధారణమైన కృషి అవసరమని పేర్కొంది. ఈ విస్తృత లక్ష్యాన్నే చైర్మన్ వ్యాఖ్యలు ప్రతిబింబిస్తాయని వివరణ ఇచ్చింది.

వారానికి 90 గంటలు పని చేయాలన్న ఎల్అండ్‌టీ చైర్మన్ ఉద్యోగులు వారానికి 90 గంటల పాటు పని చేయాలని, ఆదివారాలు సైతం కార్యాలయాలకు వెళ్లాలని ఎల్అండ్‌టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఎల్అండ్‌టీ ఉద్యోగులతో ఇటీవల ఆన్‌లైన్‌లో సుబ్రహ్మణ్యన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంస్థలో వారానికి ఆరు రోజుల పని విధానాన్ని అమలు చేయడాన్ని ఓ ఉద్యోగి ప్రశ్నించారు. దీనికి సమాధానంగా.. 'ఆదివారాలు కూడా మీతో పని చేయించలేకపోతున్నందుకు నేను బాధపడుతున్నాను. మీతో ఆదివారాలు సైతం పని చేయిస్తే చాలా సంతోషపడతాను. ఎందుకంటే, నేను ఆదివారాలు కూడా పని చేస్తున్నాను. ఎంత సేపు ఇంట్లో కూర్చుంటావు? ఎంతసేపు నీ భార్యను అలా తదేకంగా చూస్తూ ఉండగలవు? ఆఫీసుకు వెళ్లి పని చేయడం ప్రారంభించు' అని ఆయన వ్యాఖ్యానించారు. అంతటితో ఆగని సుబ్రహ్మణ్యన్.. వారానికి 90 గంటలు పని చేయాలని సైతం ఆయన సెలవిచ్చారు. తాను ఒక చైనా వ్యక్తితో మాట్లాడానని, చైనా కార్మికులు వారానికి 90 గంటలు పని చేస్తారని, అమెరికన్లు 50 గంటలే పని చేస్తారు కాబట్టి కొన్ని రోజుల్లో అమెరికాను చైనా దాటేస్తుందని ఆ వ్యక్తి చెప్పినట్టు సుబ్రహ్మణ్యన్ చెప్పుకొచ్చారు. 'మీరు కూడా ప్రపంచంలో ఉన్నత స్థాయిలో ఉండాలంటే వారానికి 90 గంటలు పని చేయాల్సిందే. ముందుకొచ్చి పని చేయండి' అని ఆయన పిలుపునిచ్చారు. ఆయనపై నెటిజన్లు మండిపడుతున్నారు. ఉద్యోగుల వ్యక్తిగత జీవితాలను చిన్నచూపు చూసేలా ఆయన మాట్లాడుతున్నారని విమర్శిస్తున్నారు.

## ఉగ్రవాదులున్న జైలు వద్ద డ్రోన్.. 8 రోజుల తర్వాత గుర్తింపు




**భోపాల్:** ఉగ్రవాదులను ఉంచిన జైలు వద్ద డ్రోన్ ల్యాండ్ అయ్యింది. కెమెరాలున్న దీనిని 8 రోజుల తర్వాత భద్రతా సిబ్బంది గుర్తించారు. ఈ నేపథ్యంలో ఆ జైలులోని భద్రతా ప్రమాణాలపై విమర్శలు వెల్లువెత్తాయి. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఈ సంఘటన జరిగింది. అక్కడి కేంద్ర కారాగారంలో కరుడు గట్టిన 69 మంది ఉగ్రవాదులను ఉంచిన ప్రత్యేక సెల్ బీ బ్లాక్ సమీపంలో ఒక డ్రోన్ పడి ఉంది. జనవరి 8న భద్రతా సిబ్బంది దీనిని గుర్తించారు. కాగా, కెమెరాలున్న చైనా తయారీ డ్రోన్ భోపాల్ జైలు వద్ద కనిపించడం కలకలం రేపింది. డిసెంబర్ 31న అది అక్కడ ల్యాండ్ అయినట్లు సీసీటీవీ ఫుటేజ్ ద్వారా భద్రతా సిబ్బంది తెలుసుకున్నారు. గత ఎనిమిది రోజులుగా జైలు ప్రాంగణంలో ఆ డ్రోన్ ఉన్నప్పటికీ ఎవరూ గమనించలేదు. ఈ నేపథ్యంలో ఆ జైలులో భద్రతా లోపాలు, సిబ్బంది నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తాయి. మరోవైపు ఆ డ్రోన్ యజమాని స్థానిక డాక్టర్ స్వప్నిల్ జైన్‌గా పోలీస్ అధికారులు గుర్తించారు. అతడి కుమారుడి కోసం కొన్న ఆ డ్రోన్ డిసెంబర్ 31న నియంత్రణ కోల్పోయి జైలు సమీపంలో పడినట్లు తెలుసుకున్నారు. కాగా, ఐఎస్‌వో సర్టిఫైడ్ భోపాల్ జైలులో జామర్లు, సీసీటీవీలు సహా బహుళ స్థాయి భద్రత ఉన్నప్పటికీ వారం రోజులకు పైగా ఆ డ్రోన్‌ను భద్రతా సిబ్బంది గుర్తించకపోవడం ఆందోళన రేపింది. ఈ నేపథ్యంలో జైలు వద్ద భద్రతను మరింత పటిష్టం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జైలు, పరిసర ప్రాంతాలను 'నో-ఫ్లై జోన్'గా పరిగణించాలని యోచిస్తున్నది.

## 'ఇండియా' బ్లాక్ శాశ్వతం..

### కేవలం ఎన్నికల్లో పోటీ కోసం కాదు: ఫరూక్ అబ్దుల్లా



**శ్రీనగర్:** ప్రతిపక్షాల కూటమి 'ఇండియా' బ్లాక్ శాశ్వతమని జమ్ముకశ్మీర్ మాజీ సీఎం, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా అన్నారు. ఈ కూటమి కేవలం ఎన్నికల్లో పోటీ చేయడం కోసమే కాదని తెలిపారు. దేశాన్ని బలోపేతం చేయడం, ద్వేషాన్ని తొలగించడం కోసమని చెప్పారు. 'ఇండియా' బ్లాక్‌లో భాగమైన ఆప్, కాంగ్రెస్ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పరస్పరం తలపడుతున్నాయి. ఈ కూటమికి చెందిన టీఎంసీ, శివసేన (యూబీటీ) వంటి పార్టీలు ఆప్‌కు మద్దతు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో 'ఇండియా' కూటమి ఐక్యత, మనుగడపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కేవలం లోక్‌సభ ఎన్నికల కోసమే అయితే ఈ కూటమిని ముగించవచ్చని ఫరూక్ అబ్దుల్లా కుమారుడు, జమ్ముకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా గురువారం సూచించారు. కాగా, ఈ పరిణామాల నేపథ్యంలో 'ఇండియా' కూటమి భవిష్యత్తు గురించి మీడియా అడిగిన ప్రశ్నకు ఫరూక్ అబ్దుల్లా సమాధానమిచ్చారు. ఈ కూటమి కేవలం ఎన్నికల్లో పోటీ చేయడం కోసం కాదని తెలిపారు. దేశాన్ని బలోపేతం చేయడం, ద్వేషాన్ని తొలగించడం కోసమని చెప్పారు. 'ఈ కూటమి శాశ్వతం. ఇది ప్రతి రోజు, ప్రతి క్షణానికి సంబంధించినది' అని అన్నారు. అయితే ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలోని ప్రభుత్వం కేంద్రంతో పోరాటం చేయదని తెలిపారు. జమ్ముకశ్మీర్ సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తుందని స్పష్టం చేశారు.

## జార?ండ్ మాజీ ముఖ్యమంత్రి రఘుబర్ దాస్ బీజేపీలో చేరిక

'మేము తిరిగి వస్తామనే నినాదంతో జార?ండ్ మాజీ ముఖ్యమంత్రి, ఒడిశా గవర్నర్ రఘువర్ దాస్ ఈరోజు బీజేపీలో చేరారు. శుక్రవారం రాంచీలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రఘువర్ దాస్ రెండోసారి పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. బీజేపీ సభ్యత్వం తీసుకున్న తర్వాత, రఘువర్ దాస్ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. 'ఒడిశా గవర్నర్ పదవికి రాజీనామా చేయడం ద్వారా, ఆయన ఇప్పుడు తన పాత పాత్రకు తిరిగి వస్తున్నట్లు చెప్పారు. గవర్నర్‌గా ఉండటం గౌరవానికి సంబంధించిన విషయమన్నారు.

**కొత్త ఏడాది.. కొత్త ఉత్సాహంతో**

2024 సంవత్సరం నుంచి పాఠాలు నేర్చుకుంటూ 2025 కొత్త సంవత్సరంలో కొత్త శక్తి, కొత్త ఉత్సాహం, కొత్త ఉత్సాహంతో, అందరూ బీజేపీ కార్యకర్తలు ప్రజా ప్రయోజనాల కోసం పోరాడి విజయం సాధించాలని మాజీ ముఖ్యమంత్రి అన్నారు. జనవరి 10 తనకు చారిత్రాత్మకమైన రోజు అని రఘువర్ దాస్ అన్నారు. 1980లో ఈ రోజున, ఆయన బీజేపీలో ప్రాథమిక సభ్యుడయ్యారు. ఇప్పుడు ఆయన రెండో సారి బీజేపీ సభ్యత్వాన్ని తీసుకుంటున్నారు. తాను గవర్నర్‌గా నియమితుడైనప్పుడు, 2023 అక్టోబర్ 26న న్యూఢిల్లీలో జాతీయ అధ్యక్షుడు జె.పి. నడ్డాను కలిసి తన రాజీనామాను సమర్పించినప్పుడు, అది తన జీవితంలో చాలా భావోద్వేగ క్షణం అని ఆయన అన్నారు.



**గెలుపు, ఓటములు**

రాజకీయ జీవితంలో గెలుపు, ఓటములు ఉంటాయని రఘువర్ దాస్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. గెలుపు, ఓటమి జీవితంలో ఒక భాగమని అన్నారు. 1984లో బీజేపీకి ఇద్దరు ఎంపీలు ఉన్నప్పుడు ప్రతిపక్షాలు 'హమ్ దో హమారే దో' అని ఎగతాళి చేశాయని, ఆ రోజును ప్రజలు చూశారని పేర్కొన్నారు. కానీ మీ అందరికీ తెలుసు, ఇప్పుడు బీజేపీ దేశాన్ని అంతిమ స్థాయికి తీసుకెళ్లే దిశగా కొనసాగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజలకు సేవ చేయడానికి అధికారం మనకు ఒక సాధనమని ఆయన అన్నారు. ఈ కారణంగా ప్రధానమంత్రి నాయకత్వంలో కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం వరుసగా మూడవసారి అధికారంలోకి వచ్చింది. నేడు, భారతీయ జనతా పార్టీ, ఎన్డీఏ ప్రభుత్వాలు దేశంలోని 22 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నాయని రఘువర్ దాస్ తెలిపారు.

**కొన్ని నెలల తర్వాత పోరాటం**

జార?ండ్ ప్రజలు ఇచ్చిన ఆదేశాన్ని తాను గౌరవిస్తున్నానని మాజీ ముఖ్యమంత్రి రఘువర్ దాస్ అన్నారు. జార?ండ్ ప్రజలు ఇండియా అలయన్స్ ప్రభుత్వానికి పాలించడానికి మెజారిటీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ఆధారంగా ఇండియా అలయన్స్‌కు ఆధిక్యం లభించిందన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని ఆయన అన్నారు. సంకీర్ణ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడానికి పార్టీ కొన్ని నెలలు మాత్రమే వేచి చూస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో లేకపోతే బీజేపీ వీధుల నుంచి సభ వరకు ప్రజా ప్రయోజన అంశాలపై వాగ్దానాలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని ఒత్తిడి చేస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బాబులాల్ మరాండి, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీంద్ర రాయ్, కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్, ఎంపీ మనీష్ జైస్వాల్, రాజ్యసభ ఎంపీ ఆదిత్య సాహు, మాజీ ప్రతిపక్ష నాయకుడు అమర్ బౌరి, ఎమ్మెల్యే సహా అనేక మంది బీజేపీ నేతలు నీరా యాదవ్, అలోక్ చౌరాసియా సహా పలువురు హాజరయ్యారు.

# ప్రత్యేక ప్రదర్శనల అనుమతిపై హైకోర్టు అసంతృప్తి

-మొదటిపేజీ తరువాయి

ఈనెల 24వ తేదీకి వాయిదా వేసింది. కాగా.. అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 సినిమా రిలీజ్ సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో ఓ మహిళ మృతి చెందగా... బాలుడు అస్వస్థతకు గురయ్యాడు. ఈ కేసుకు సంబంధించి అల్లు అర్జున్ జైలుకు వెళ్లి.. బెయిల్‌పై బయటకు వచ్చారు. అయితే తొక్కిసలాట ఘటనను తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఇకపై బెన్‌ఫిట్‌షోలకు అనుమతించేది లేదని స్పష్టం చేసింది. దిల్ రాజు నేతృత్వంలో సినీ పెద్దలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలువగా ఇదే విషయాన్ని తేల్చి చెప్పారు సీఎం. ఇదిలా ఉండగా... శంకర్ దర్శకత్వంలో రాంచరణ్ నటించిన గేమ్ చేంజర్ సినిమా టికెట్‌ల ధరల పెంపునకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. అర్ధరాత్రి ఒంటి గంటకు బెనిఫిట్ షోలకు అనుమతించని ప్రభుత్వం.. తెల్లవారుజామున 4 గంటల నుంచి 6 గంటల షోకు అనుమతినిస్తూ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు.

**బ్రాండ్ ఏపీ ముందుకెళ్తోంది**

అయితే గేమ్ ఛేంజర్ సినిమా టికెట్ల పెంపు, స్పెషల్ షోలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కొందరు హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్‌ను దాఖలు చేశారు. నిన్న (గురువారం) ఈ పిటిషన్‌ను జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి విచారించగా.. గేమ్ చేంజర్ సినిమా స్పెషల్ షోకు అనుమతి ఇవ్వడంపై పిటిషనర్




తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. టికెట్ పెంపుపై ఉత్తర్వులు ఇవ్వకుండా ఆదేశించాలని హైకోర్టును పిటిషనర్ కోరారు. దీనిపై విచారణను ఈరోజు వాయిదా వేసిన కోర్టు.. నేటి విచారణలో ప్రత్యేక షోలకు అనుమతి ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. తెల్లవారుజామున షోలకు అనుమతి ఇవ్వడంపై పునసమీక్షించాలని హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 24కు హైకోర్టు వాయిదా వేసింది.

# టార్గెట్ కేసీఆర్... రేవంత్ వ్యూహం అదేనా

-మొదటిపేజీ తరువాయి

పెట్టాలని భావిస్తోంది. అయితే ఏడాదిగా చేస్తున్న ప్రయత్నాలు కొలిక్కి రావడం లేదు. తాజాగా ఫార్ములా ఈ రేసు కేసులో కేటీఆర్ విదేశీ సంస్థకు చెల్లించిన రూ.56 కోట్ల వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. విచారణకు పిలిచింది. అనేక ట్విస్టుల తర్వాత కేటీఆర్ విచారణకు హాజరయ్యారుఎన్నికలు జరిగి ఏడాది గడిచినా.. బీఆర్ఎస్ శాసన సభా పక్ష నేతగా ఎన్నికైన కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదు. రేవంత్ ముందు తాను ప్రతిపక్షంలో కూర్చోలేకనే రావడం లేదన్న వాదన ఉంది. గతంలో కాలు విరిగిందని సాకులు చెప్పిన గులాబీ నేతలు ఇప్పుడు కేసీఆర్ గైర్హాజర్‌పై నోరు మెదపడం లేదు. అసెంబ్లీలో కేటీఆర్, హరీశ్‌రావే అన్నీ చూసుకుంటున్నారు. అయితే సీఎంగా రేవంత్ ఉన్న నేపథ్యంలో ఆయన ఎదుట ప్రతిపక్ష నేతగా అసెంబ్లీలో కూర్చోవడం ఇష్టం లేకనే రావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు కేసీఆర్‌ను ఫామ్‌హౌస్ నుంచి బయటకు రప్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. ఇందులో భాగంగానే ఈ ఫార్ములా కేసులో కేటీఆర్‌ను అరెస్టు చేయడానికి రంగం సిద్ధం చేసింది. మరోవైపు హరీశ్‌రావును కూడా కాళేశ్వరం కేసులో ఇరికించే అవకాశం ఉంది. ఈ చర్యలతో అయినా కేసీఆర్ బయటకు వస్తారని భావిస్తోంది.ఇదిలా ఉంటే కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదని సీఎం రేవంత్‌రెడ్డి తరచూ ప్రశ్నిస్తున్నారు. పదేళ్లు సీఎంగా పనిచేసిన కేసీఆర్ సూచనలు తమకు అవసరమని వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తున్నారు. 80 వేల పుస్తకాలు చదివిన కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదని, తెలంగాణ ప్రగతికి ఆయన తెలివి ఎందుకు ఉపయోగించడం లేదని నిలదీస్తున్నారు. మరోవైపు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ ఇంటికి మంత్రి పొన్నం ప్రభాకర్ వెళ్లారు. స్వయంగా కార్యక్రమానికి ఆహ్వానించారు. ఇక మాజీ ప్రధాని మన్‌మోహన్‌సింగ్‌కు నివాళులర్పించేందుకు ఏర్పాటుచేసిన అసెంబ్లీ ప్రత్యేక సమావేశానికి రావాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కేసీఆర్‌కు స్వయంగా ఫోన్ చేసి ఆహ్వానించారు. అయినా కేసీఆర్ ఫామహౌస్ దాటలేదు.కొడుకు కేటీఆర్ అరెస్ట్ అయ్యే అవకాశం ఉంది. హరీశ్‌రావును కూడా ఏదో ఒక కేసులో అరెస్టు చేయవచ్చన్న చర్చ జరుగుతోంది. అదే జరిగితే పార్టీ బాధ్యతలు ఎవరు చూస్తారన్న చర్చ ఇప్పుడు బీఆర్ఎస్‌లో జరుగుతోంది. ఇలాంటి తరుణంలోనే కేసీఆర్ కూతురు కవిత నేనున్నానంటూ మళ్లీ యాక్టివ్ అయ్యారు. అయితే ఢిల్లీ లిక్కర్ కేసులో నిందితురాలిగా ఉన్న కవిత పార్టీ బాధ్యతలు నిర్వహించడంపై పార్టీలోనే కొందరు విముఖంగా ఉన్నారు. ఈ క్రమంలో కేసీఆర్ ఫాంహౌస్ వీడతారా లేదా అన్నది చర్చనీయాంశంగా మారింది. కేసీఆర్ రాకుంటే క్యాడర్ చీలిపోయే ప్రమాదం ఉంది. పార్టీకి తీవ్ర నష్టం కలుగుతుంది.

# కమిటీ లేకుండానే ఐనవోలు జాతర

**వరంగల్ :** రాష్ట్రంలో ప్రముఖ శైవ క్షేత్రమైన ఐనవోలు మల్లికార్జునస్వామి మహా జాతరకు సమయం ఆసన్నమైంది. ఇంకో మూడు రోజుల్లోనే స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఏటా సంక్రాంతి నుంచి ప్రారంభమయ్యే ఈ జాతరకు భోగి నుంచి కనుమ రోజుల్లోనే దాదాపు 10 లక్షల మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉంటుంది.రద్దీ తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యతను ఆలయ పాలకవర్గం తీసుకోవాల్సి ఉంటుంది. కానీ గత మూడేళ్ల నుంచి ఐనవోలు ఆలయ ట్రస్ట్ బోర్డు వ్యవహారంలో కోర్టు కేసులో చిక్కుకోవడంతో ఇప్పటి వరకు పాలకవర్గ ఏర్పాటుపై ఎలాంటి క్లారిటీ రాలేదు. ఇదిలాఉంటే కొంతమది నాయకులు తామే పాలకవర్గ సభ్యులమంటూ చెప్పుకుంటుండగా.. అధికారులు మాత్రం అధికారికంగా కమిటీ మాత్రం ప్రకటించలేదు. దీంతో ట్రస్ట్ బోర్డు ఉన్నట్టా.. లేనట్టా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.2023 జాతర సమయంలో జనవరి 10 తేదీన దేవాదాయశాఖ ప్రకటించిన ట్రస్ట్ బోర్డు కారణంగా ఆలయంలో వివాదం చెలరేగింది. అప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా.. అప్పటి ఎమ్మెల్యే అరూరి రమేష్ తనకు సన్నిహితుడిగా ఉండే మజ్జిగ జయపాల్కు ఆలయ ఛైర్మన్ ఇస్తానని గతంలో హామీ ఇచ్చారు. ఈ మేరకు 14 మంది సభ్యులను ఎంపిక చేసి ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు ప్రపోజల్స్ పంపించారు. ఆ తరువాత జనవరి 10న దేవాదాయ శాఖ ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.ఇందులో మజ్జిగ జయపాల్ కు ఛైర్మన్ పదవి హామీ ఉండగా.. ఆయనే ఛైర్మన్ గా ఎన్నుకునేందుకు అంతా రంగం సిద్ధం చేశారు. కానీ ఎండోమెంట్ యాక్ట్ ప్రకారం ఆలయంలో వాటాదారుగా ఉన్న వ్యక్తులకు ట్రస్ట్ బోర్డు సభ్యులుగా అవకాశం ఇవ్వకూడదు. కానీ రూల్ ను పట్టించుకోకుండా ఆలయంలో వాటాదారుగా ఉన్న జయపాల్ కు ఛైర్మన్ పదవి ఇచ్చేందుకు కసరత్తు చేయడంతో హనుమకొండకు చెందిన పైళ్ల శ్రీనివాస్ అనే వ్యక్తి రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. దీంతో దేవాదాయశాఖ ప్రకటించిన ట్రస్ట్ బోర్డు చెల్లదంటూ హైకోర్టు మధ్యంతర



ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికీ దానిపై విచారణ జరుగుతుండగానే గత ఆగస్టు 30న దేవాదాయ శాఖ నూతన ధర్మకర్త మండలి ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానించింది.దీంతో కోర్టులో కేసు కొనసాగుతుండగా.. నూతన పాలకవర్గం ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానించడం సరికాదని, అలా కాదని ఎంపిక చేపడితే తాము కోర్టు నుంచి సవాల్ చేస్తామంటూ అప్పట్లో వివాదంలో చిక్కుకున్న కమిటీ సభ్యులు దేవాదాయ శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కోర్టు తీర్పు వెలువడే వరకు ట్రస్ట్ బోర్డు ఎంపిక వాయిదా వేయాలని అటు ప్రభుత్వ పెద్దలతో పాటు ఆఫీసర్లు కూడా నిర్ణయానికి వచ్చారు. కాగా 2023 జాతర నుంచి ట్రస్ట్ బోర్డుపై వివాదం నడుస్తుండగా.. ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర సంక్రాంతి నుంచి ప్రారంభమై ఉగాది వరకు కొనసాగుతుంది. భోగి పండుగ నుంచి ఉత్సవాలు ప్రారంభం కానుండగా.. భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తుంటారు. కేవలం ఈ మూడు రోజుల్లోనే దాదాపు 10 లక్షల మందికిపైగా భక్తులు తరలి వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.ఇంత పెద్ద ఎత్తున భక్తుల తరలివచ్చే జాతరలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేయడంలో పాలకవర్గానిదే కీలకపాత్ర. కానీ ట్రస్ట్ బోర్డు విషయం కోర్టు పరిధిలో ఉండటంతో టెంపరరీగా జాతర కమిటీ వేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు వర్ధన్నపేటకు చెందిన వ్యక్తిని జాతర కమిటీ ఛైర్మన్ గా ప్రకటించేందుకు ఎమ్మెల్యే వర్గం పావులు కదుపుతున్నట్లు తెలిసింది. కాగా అదే కమిటీ ట్రస్ట్ బోర్డుగా ఉంటుందని స్థానికంగా ప్రచారం కూడా జరుగుతోందిప్రతిసారి జాతర సమయంలో మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీరు తదితర వసతులు సరిగా లేక భక్తులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. జాతర సమయంలో టెంపరరీ టాయిలెట్స్ ఏర్పాటు చేస్తున్నా అవి కూడా జనాలకు సరిపోవడం లేదు. దాంతో జాతరలో శానిటేషన్ కూడా ప్రధాన సమస్యగా మారింది.ప్రతిసారి పంచాయతీలు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ సిబ్బంది దాదాపు 500 మందితో పనులు చేయిస్తున్నా.. అక్కడ సేవలందలేని పరిస్థితి నెలకొంటోంది. దీంతో ఈసారి కూడా జాతర సమయంలో భక్తులు ఇబ్బందులు తప్పవనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఓ వైపు పాలకవర్గం లేకపోవడం, ఆఫీసర్లపైనే భారమంతా పడుతుండటం ఇబ్బందిగా మారగా.. అదనపు సిబ్బందిని కేటాయించి భక్తులకు సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

## అద్భుతాలు చేసే వారు మాతో రండి

-మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి. చంద్రమండలానికి వెళ్తున్నామని, కానీ భూమిపై ఎలా ఉండాలో మాత్రం తెలుసుకోలేకపోతున్నామన్నారు. కాలుష్య కారక వాహనాలను అవుటర్ రింగ్ రోడ్డు అవతలికి తరలిస్తున్నామని తెలిపారు.మచిలీపట్నం పోర్టుకు అనుసంధానం చేస్తూ రోడ్డు, రైలు మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు సీఎం. రీజనల్ రింగ్ రైల్వే లైన్ మంజూరు చేయాలని ప్రధాని మోదీని కోరామన్నారు. చైనా తరహాలో క్లస్టర్లు ఏర్పాటు చేస్తామన్నారు. అవుటర్ రింగ్ రోడ్డు-రీజనల్ రింగ్ రోడ్డు మధ్య రేడియల్ రోడ్లు నిర్మిస్తామని గుర్తు చేశారు.అభివృద్ధితోపాటు ఇక్కడ యువతకు ఉపాది కల్పించాలన్నది తమ ఉద్దేశంగా చెప్పారు సీఎం రేవంత్‌రెడ్డి. తెలంగాణలో ప్రతి ఏడాది లక్షా పదివేల మంది ఇంజనీరింగ్ విద్యార్థులు పట్టా పట్టుకుని బయటకు వస్తున్నారని, వారిలో ఎక్కువ మంది స్కిల్ ఉండలేదన్నారు. టాటా గ్రూప్‌తో కలిసి రూ. 2400 కోట్లతో రాష్ట్రంలో ఐటీఐలను ఐటీసీలుగా మారుస్తున్నామని గుర్తు చేశారు.నైపుణ్యాల పెంపు కోసం ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని, అందుకు సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఐఎస్‌బీ తరహాలో స్కిల్ యూనివర్సిటీ కోసం ఆనంద్ మహీంద్రాను ఛైర్మన్‌గా నియమించామని గుర్తు చేశారు. స్కిల్ యూనివర్సిటీ కార్పస్ ఫండ్ కోసం సీఐఐ ప్రతినిధులు మద్దతు ఇవ్వాలన్నారు.అలాగే స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ హబ్ కూడా ఏర్పాటు చేస్తున్నామని, రానున్న 50 ఏళ్ల కోసం ప్రణాళికలు రచిస్తున్నామని తెలియజేశారు. సీఐఐ ప్రతినిధులు ఎప్పుడైనా వచ్చి తనను కలవచ్చని, మా ప్రభుత్వం అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు.తెలంగాణలో స్వయం సహాయక సంఘాల్లో 67 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారని వివరించారు సీఎం రేవంత్. ప్రభుత్వ కార్యాలయాల్లో స్వయం సహాయక మహిళా సంఘాలతో క్యాంటీన్లు ఏర్పాటు చేయించామన్నారు. వారితో సోలార్ పవర్ స్టేషన్లు ఏర్పాటు చేయిస్తున్నామన్నారు.1000 మెగావాట్ల సోలార్ పవర్ ఉత్పత్తి చేసేలా మహిళా సంఘాలను ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. హైటెక్ సిటీ పక్కనే మహిళా సంఘాల ఉత్పత్తులను విక్రయించు కునేందుకు మూడున్నర ఎకరాల స్థలంలో స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ధ్యేయంగా అడుగులు వేస్తున్నామని, గ్రామీణ మహిళల సాధికారతపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు చెప్పుకొచ్చారు సీఎం రేవంత్‌రెడ్డి.

## ఎక్కువ రేటుకు టిక్కెట్లు అమ్మితే... తాట తీస్తాం

-మొదటిపేజీ తరువాయి

సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్. అధిక ధరలకు బస్సు టికెట్లు విక్రయించినట్లు తెలిస్తే.. ఆయా బస్సుల్ని సీజ్ చేస్తామంటూ హెచ్చరికలు చేశారు.సంక్రాంతి పండుగ నేపథ్యంలో పొరుగు రాష్ట్రాలతో పాటుగా రాష్ట్రంలోని జిల్లాలకు భారీగా తరలివెళుతుంటారు. వారి సౌకర్యార్థం.. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని మంత్రి పొన్నం తెలిపారు. తెలంగాణ ఆర్టీసీ ప్రజల సౌకర్యార్థం ఏకంగా.. 6,432 ప్రత్యేక బస్సులను టీజీఆర్టీసీ నడపేందుకు నిర్ణయం తీసుకుందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులు జనవరి 10 శుక్రవారం నుంచి మొదలవుతాయని వెల్లడించారు.ప్రయాణికులకు అవసరమైతే ఆర్టీసీ మరిన్ని బస్సులు నడపడానికి కూడా సిద్ధంగా ఉందని తెలిపిన మంత్రి పొన్నం? ఆర్టీసీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రతీ మేజర్ బస్ స్టేషన్ దగ్గర ప్రత్యేక అధికారులు ఉండాలన్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా నిత్యం పర్యవేక్షిస్తూ,చర్యలు చేపట్టాలని పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా.. బస్సుల్లో అదనంగా మహిళలు వచ్చే అవకాశం ఉందని అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తుండాలని అధికారులకు సూచించారు.

**ప్రైవేట్ ట్రావెల్స్ కు హెచ్చరిక..**

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల యాజమాన్యాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరిక చేశారు. పండగల సమయంలో ప్రయాణికుల వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు అదనపు చార్జీలు వసూలు చేస్తే బస్సులు సీజ్ చేస్తామన్నారు. ప్రయాణికులకు ఏ సమస్య వచ్చిన రవాణా శాఖ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. పండగ పూట ప్రైవేట్ ట్రావెల్స్ ప్రజలను ఇబ్బంది పెట్టవద్దన్న మంత్రి పొన్నం.. ఎలాంటి ఘటనలు జరిగితే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు చేస్తే.. చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

మంత్రి ఆదేశాల నేపథ్యంలో రవాణా శాఖ అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో అన్ని బస్సులు, ఛార్జీలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు సమాచారం. ఏకంగా రవాణా శాఖ మంత్రే ఆదేశాలు జారీ చేయడంతో పాటు తమ ప్రభుత్వం ప్రయాణికుల భద్రత, సంక్షేమనికే ప్రాధానత్య కల్పిస్తుందంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ప్రయాణికులు పండగ సమయంలో జాగ్రత్తగా గమ్య స్థానాలకు వెళ్లాలని కోరారు. తమ ప్రజా ప్రభుత్వం.. అన్ని వర్గాల భద్రత గురించి ఆలోచిస్తుందని, ఎవరికి సమస్య వచ్చినా వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తుందని వెల్లడించారు. సాధారణంగానే.. పండుగ రోజుల్లో ప్రైవేట్ ట్రావెల్స్ ఆగడాలు సృతి మించుతుంటాయి. అధిక ధరలకు టికెట్లు విక్రయిస్తూ.. సామాన్యులకు చుక్కలు చూపిస్తుంటారు. ఎవరైనా.. ఓ నలుగురు కుటుంబ సభ్యులతో ప్రయాణం పెట్టకుంటే.. జేబుకు చిల్లు పడాల్సిందే. కానీ.. ప్రస్తుతం ప్రభుత్వం అదనపు ఆర్టీసీ బస్సుల్ని నడపడం, ప్రైవేట్ ట్రావెల్స్ ధరలపై నియంత్రణ విధించడంతో.. సామాన్యులకు పెద్ద ఊరటే అంటున్నారు.

## ఎమ్మెల్సీ స్థానాలకు బీజేపీ అభ్యర్థుల ప్రకటన



-మొదటిపేజీ తరువాయి

– ఆదిలాబాద్ – మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థిగా మల్కా కొమరయ్య, కరీంనగర్ -నిజామాబాద్ -ఆదిలాబాద్ – మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సి అంజిరెడ్డిని ఎంపిక చేసినట్టు కిషన్ రెడ్డి ప్రకటించారు.

**సరోత్తమ్ రెడ్డి..**

సరోత్తమ్ రెడ్డి వరంగల్ జిల్లాకు చెందిన వ్యక్తి. ప్రధానోపాధ్యాయుడిగా 10 ఏండ్లు, స్కూల్ అసిస్టెంట్ టీచర్‌గా 21 ఏండ్లు పని చేశారు. 2012 నుంచి 2019 దాకా పీఆర్టీయూ జనరల్ సెక్రటరీగా సేవలందించారు. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. టీచర్ల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేశారు సరోత్తమ్ రెడ్డి.

**మల్క కొమరయ్య**

పెద్దపల్లికి చెందిన మల్క కొమరయ్య.. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బీఈ పట్టా పుచ్చుకున్నారు. పెద్దపల్లి, నిర్మల్, హైదరాబాద్‌లో అనేక విద్యా సంస్థలను నెలకొల్పారు. పల్లవి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌కు ఛైర్మన్‌గా సేవలందిస్తున్నారు.

**అంజిరెడ్డి**

మెదక్ జిల్లాలోని రామచంద్రాపురానికి చెందిన సీ అంజిరెడ్డి బీఏ పూర్తి చేశారు. పారిశ్రామికవేత్తగా ఎదిగారు. అంజిరెడ్డి భార్య గోదావరి.. సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. గత రెండు దశాబ్దాల నుంచి ఎస్ఆర్ ట్రస్ట్‌ను అంజిరెడ్డి నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సురక్షిత తాగునీటిని అందించేందుకు ఎస్ఆర్ ట్రస్ట్ తోడ్పాటును అందిస్తుంది. అంతేకాకుండా పేద విద్యార్థులకు విద్యా, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది.

## సంపాదకీయం

# కాంగ్రెస్ అంటే జీర్ణించుకోలేని ప్రధాని!

గతంలో జవహర్ లాల్ నెహ్రూ దగ్గర నుండి కాంగ్రెస్ పార్టీ 'హిందూ' ఫోబియాతో భారతీయ సామాజిక జీవనానికి చెప్పలేని విధ్వంసాలు సృష్టిస్తూ వచ్చింది. నాడు స్వాతంత్ర్య పోరాటంలో తిరుగులేని నాయకత్వం వహించిన కాంగ్రెస్ నేతల అవకాశవాద విధానాలను సవాల్ చేస్తూ ప్రజలలో ప్రాబల్యం పెంచుకుంటున్న హిందూ మహాసభపట్ల చెలరేగిన అభద్రతా భావమే అటువంటి ఫోబియాకు దారితీసిందని చెప్పవచ్చు. ఆ తర్వాత దేశవిభజన సమయంలో కాంగ్రెస్ నిస్తేజంగా మారడం, హిందువుల రక్షణ కోసం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అగ్రగామిగా నిలబడడంతో ఆ సంస్థ పట్ల అభద్రతా భావం చెలరేగింది. ముందుగా సర్దార్ పటేల్ ద్వారా కాంగ్రెస్ అనుబంధ స్వచ్ఛంద సంస్థగా ఆర్ఎస్ఎస్ ను చేరమని అధికారికంగా కాంగ్రెస్ ఆహ్వానించింది. అందుకు ఆ సంస్థ విముఖత వ్యక్తం చేయడంతో ఆ పటేల్ ద్వారానే గాంధీజీ హత్యను సాకుగా తీసుకొని ఆ సంస్థపై నిషేధం విధించింది. ఆ తర్వాత జనతా ప్రభుత్వంలోని సోషలిస్టులలో సైతం ఆర్ఎస్ఎస్పట్ల అభద్రతా భావం ఏర్పడింది. ముందుగా ఆర్ఎస్ఎస్ సైతం జనతా పార్టీలో అనుబంధ సంస్థగా విలీనం కావాలన్నారు. అందుకు ఒప్పుకోకపోవడంతో 'ద్వంద సభ్యత్వం' వివాదంతో నాటి జనతా ప్రభుత్వాన్నే కూల్చివేశారు. కాంగ్రెస్ మొత్తం మీద మూడు సార్లు ఆర్ఎస్ఎస్పై నిషేధం విధించింది. కానీ సాధించింది ఏమీ లేదు. ఎమర్జెన్సీ సమయంలో స్వయంగా ఇందిరా గాంధీ నిషేధ సమయంలో ఆర్ఎస్ఎస్ ప్రతి మూలకు విస్తరించింది అంటూ చెప్పుకురావడం గమనార్హం. హిందూ అనే పదం హిందూ మహాసభ లేదా ఆర్ఎస్ఎస్ తీసుకొచ్చింది కాదనే స్పృహ లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీ ఎంతో నష్టపోయి నేడు తన అస్తిత్వంకోసం పోరాడాల్సిన పరిస్థితి తెచ్చుకుంది. ఈ సంస్థలకన్నా ముందు చెన్నైలో 'ది హిందూ' అనే దినపత్రిక ప్రారంభమైంది. బెంగళూరులో హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ అనే రక్షణ ఉత్పత్తుల సంస్థ ఏర్పడింది. పలు ప్రభుత్వ రంగ సంస్థలు 'హిందూ' పేరుతో వెలిశాయి. ఇప్పుడు నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి సైతం 'నెహ్రూగాంధీ', 'కాంగ్రెస్' ఫోబియాతో సతమతమవుతున్నట్లు కనిపిస్తున్నది. స్వతంత్ర భారత దేశంలో భారత సైన్యం సాంకేతికంగా గెలుపొంది, విదేశీ సైనికులు లొంగుబాటు ప్రదర్శించిన యుద్ధం 1971 మాత్రమే. ఆ ఘనమైన విజయానికి చిహ్నంగా పాక్ సైనికులు మనసైనికుల ముందు లొంగిపోయిన చిత్రాన్ని భారత సైన్యం తన ప్రధాన కార్యాలయంలో గత 50 ఏళ్లుగా ఉంచుతూ వచ్చింది. విదేశీ సైనికాధికారులు ఎవ్వరు వచ్చినా ఈ చిత్రం ముందే మన సైన్యాధిపతులతో భేటీ జరపడం, ఫోటో దిగడం జరుగుతూ వస్తోంది. ఈ చిత్రంలో ఇందిరా గాంధీ లేరు. అయినా దానిని చూడగానే ఆమె సాహసం, వైట్ హౌస్‌కు వెళ్లి 'కొన్ని వేల కిలోమీటర్ల దూరం నుండి వర్ధమాన దేశాలపై ఆధిపత్యం వహించాలి అంటే కుదరదు' అని హెచ్చరించిన ఆమె ధైర్యం ప్రజలకు గుర్తుకు వస్తాయనే భయంతో ఆ ఫోటోను మార్చివేశారు. అగ్రరాజ్యాల ప్రాపకం కోసం అర్రులు చేస్తున్న నేటి పాలకులలో ఓ విధమైన వణుకు వచ్చినట్లుంది. తమ ఘనమైన పాలన ద్వారా ప్రజలకు ఎల్లప్పుడూ గుర్తుండే ప్రయత్నం చేయకుండా గత పాలకుల గుర్తులు చెరిపివేసే ప్రయత్నాలు గత పదేళ్లుగా పెద్ద ఎత్తున చేస్తూనే ఉన్నారు. తాజాగా గత రెండేళ్లుగా ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ వార్షిక సమావేశాలు జరగడంలేదు.జనవరి 3 అంటే దేశంలో ఎక్కడో ఒకచోట సైన్స్ కాంగ్రెస్ సమావేశాలను ప్రధాన మంత్రిగా ఎవ్వరుంటే వారు ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోంది. అదే విధంగా ముగింపు సమావేశంలో రాష్ట్రపతి ప్రసంగిస్తారు. దేశంలోని కీలక శాస్త్రవేత్తలకు మాత్రమే కాకుండా, అంతర్జాతీయంగా కూడా సైన్స్‌రంగంలో గుర్తింపు పొందిన సమావేశాలు ఇవి. గత ఏడాది అయితే సమావేశాలను జరపడం లేదనే ప్రకటన చేశారు. ఈ సంవత్సరం అటువంటి ప్రకటన కూడా రాలేదు. 'కాంగ్రెస్' అంటే సమూహమని చెప్పొచ్చు. అమెరికాలో ఎన్నికైన ప్రజాప్రతినిధులతో ఏర్పడే సమూహాన్ని 'కాంగ్రెస్' అనే అంటారు. అయితే నేటి పాలకులకు కాంగ్రెస్ అనగానే అభద్రతాభావం పెల్లుబుకు వస్తున్నట్లు కనిపిస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వాలను రాష్ట్రాల్లో కూల్చి వేస్తూ వచ్చారు. ఇప్పుడు కాంగ్రెస్ పేరుతో ఉండే అన్ని రకాల సమావేశాలకు తిలోదకాలిచ్చే ప్రయత్నం చేస్తున్నారా? అనే అనుమానం కలుగుతుంది. ఇటీవల కాలంలో సైన్స్ కాంగ్రెస్ నిర్వహణకు అంతరాయం కలుగుతుంది. సమావేశాల ప్రధాన అంశాన్ని నిర్ణయించే విషయంలో కేంద్ర ప్రభుత్వ శాస్త్రీయ, సాంకేతిక మంత్రిత్వ శాఖకు, సమావేశాలను నిర్వహించే ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్‌లకు మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఈసమావేశాలు జరగడం లేదని తెలుస్తోంది. ఈ సమావేశాలకు ఆర్థిక వనరులను సమకూర్చే కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వశాఖ తాము సూచించిన అంశాలపైన చర్చించకపోతే నిధులు ఇవ్వమని స్పష్టం చేయడంతో సైన్స్ కాంగ్రెస్ నిర్వహించలేకపోతున్నట్లు తెలుస్తున్నది. సాధారణంగా కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు కేవలం అధికారంలో ఉన్న నేతల ప్రచారానికి పనికివచ్చే అంశాలను సూచించడం, అందుకు శాస్త్రవేత్తలు అంగీకరించకపోవడంతో వివాదం ఏర్పడినట్లు భావించాల్సి వస్తుంది. 1914లో లక్నోలోని కానింగ్ కాలేజ్ ప్రొఫెసర్ పిఎస్ మాక్ మహన్, మద్రాసులోని రెసిడెన్సి కళాశాల ఆచార్యులు జెఎల్ సిమన్సేన్ సంయుక్తంగా చేసిన ఆలోచన తర్వాత కాలంలో ప్రతి ఏటా సైన్స్ కాంగ్రెస్ పేరున శాస్త్రవేత్తల సమ్మేళనం జరగడానికి కారణమైంది. తొలుత కొన్ని విభాగాలతోనే అది మొదలైనా క్రమంగా విస్తరించడం, దానికి తోడుగా స్వాతంత్ర్యోద్యమం కూడా కలవడం వల్ల అది మరింత బలపడింది. 1930 నుంచి ప్రాధాన్యత మరింత స్పష్టంగా పెరుగుతూ వచ్చింది. మరీ ముఖ్యంగా 1937లో జవహర్ లాల్ నెహ్రూ ఈ సమావేశాల్లో పాల్గొని సైన్సు ప్రాధాన్యత ఏమిటో, సమాజ నిర్మాణంలో అది ఎటువంటి పాత్ర పోషించగలదో వివరించిన ప్రసంగానికి చాలా ప్రాధాన్యత ఉంది. 1947 దాకా బ్రిటిష్ వారి ఏలుబడిలో భారతీయ, ఐరోపా శాస్త్రవేత్తల కలయిక వేదికగా కొనసాగుతూ ఉండెడిది. కానీ తర్వాత కాలం లో ఈసమావేశాల్లో చేసిన ప్రతిపాదనల కారణంగానే పర్యావరణం సంబంధించి, సముద్ర వనరుల వినియోగం గురించి ప్రత్యేక దృష్టి సారించిన కారణంగానే తర్వాతి కాలంలో అవి ప్రత్యేక మంత్రిత్వ శాఖలుగా కూడా పరిణమించడం ఓ చరిత్ర. నాలుగు దశాబ్దాల క్రితం విశాఖపట్నంలో జరిగిన సైన్స్ కాంగ్రెస్ సమావేశాల్లో ప్రతి ఏటా ఒక ప్రత్యేక లక్ష్యంతో జరగాలని నిర్ణయం తీసుకోవడంతో దానికి తగ్గట్టుగా జరుగుతున్నాయి. ఇంత ప్రాధాన్యత ఉన్నా విమర్శలు కూడా క్రమంగా పెరుగుతూ వచ్చాయి. గట్టి కృషి కన్నా వట్టి ప్రచార పటాటోపమే ఎక్కువ అని, ఇంకా ఇది ఒక సైన్స్ కుంభమేళా వంటి సమ్మేళనమని కూడా తరచూ వినపడింది.అవినీతి ఆరోపణలు కూడా బాగానే ఉన్నాయి. అంతర్గత సంస్కరణల గురించి పట్టించుకోవడం లేదు. సైన్స్ కాంగ్రెస్ -2017ను నిర్వహించాల్సిన తమిళనాడులోని యూనివర్శిటీలో జరిగిన ఆర్థికపరమైన అవకతవకల కారణంగా అర్థాంతరంగా వేదికను తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి మార్చారు. కరోనా 2021, 2022 లలో సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు జరగలేదు. గత ఏడాది నాగపూర్‌లో సైన్స్ కాంగ్రెస్ సమావేశాలను ప్రధాని నరేంద్ర మోడీ వర్చ్యువల్‌గా ప్రారంభించారు. జనవరి 2024లో జరిగే సైన్స్ కాంగ్రెస్‌కు ప్రభుత్వం నుండి ఎటువంటి మద్దతు ఉండబోదని కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ గత సెప్టెంబర్‌లో స్పష్టం చేయడంతో తొలుత సైన్స్ కాంగ్రెస్ వేదికగా నిర్ణయమైనా లక్నో యూనివర్శిటీ వెనకడుగు వేసింది. ఆ తర్వాత ముందుకొచ్చిన లవ్లీ యూనివర్శిటీ సైతం కొద్ది రోజుల ముందే చేతులెత్తేయడంతో మరో వేదిక ఏర్పాటు చేసుకోవడం సాధ్యం కాలేదు. వీలైతే వచ్చే నేల జరిపేందుకు నిర్వహణకు ముందుకు వచ్చే సంస్థలకు విజ్ఞప్తి చేయనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అరవింద్ సక్సేనా ప్రకటించారు. ఐదు రోజుల పాటు సైన్స్ కాంగ్రెస్ జరిపే సంస్థలకు కేంద్ర ప్రభుత్వం రూ 5 కోట్లు ఇస్తుంది. సైన్స్ కాంగ్రెస్ సమావేశాలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2015 నుండి భారతీయ అంతర్జాతీయ సైన్స్ ఉత్సవాలను జరుపుతుంది. తమ స్వతంత్ర నిర్వహణను కాపాడుకునేందుకు ప్రభుత్వ జోక్యాన్ని నిరసిస్తూ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ కోర్టు మెట్లు కూడా ఎక్కాల్సి వచ్చింది. ఏదిఏమైనా రాజకీయ వివాదాల సుడిగుండంలో ప్రతిష్ఠాకరమైన ఇండియా సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు అంతరించి పోనున్నాయా?

# ఇంటి పేరును విక్టరీగా మార్చుకున్న వీరమాచనేని

వి.మధుసుదనరావు (వీరమాచనేని మధుసూదనరావు) తెలుగు సినిమా ప్రముఖ దర్శకులు.తెలుగు సినీ రంగంలో అర్ధ శతాబ్ధం పాటు ఎన్నో చిత్రాలకు దర్శకునిగా పని చేసి, విజయవంతం కావడానికి కృషి సల్పి, విజయం సాధించి, "విక్టరీ" మధుసూదన్ రావుగా పేరు గాంచారు. ప్రజానాట్య మండలి నేపథ్యం నుంచి సినిమా రంగానికి వచ్చిన ఉత్తమ కళా పిపాసి ఆయన. తెలుగు చిత్ర సీమలో మకుటం లేని మహారాజులుగా చెలామణి అయిన నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు లతో ఎన్నో విజయ వంతమైన చిత్రాలు తీశారు. తరవాతి కాలంలో శోభన్ బాబు, కృష్ణం రాజు, కృష్ణ వంటి హీరోలతో ఎన్నో చిత్రాలను అందించి, సక్సెస్ఫుల్ డైరెక్టర్ గా గుర్తింపు పొందారు. 1962 లో సూపర్ స్టార్ కృష్ణని పరిచయం చేస్తూ "పదండి ముందుకు" తీశారు.హీరోలు నాగార్జునను "విక్రం" ద్వారా, జగపతి బాబును "సింహ స్వప్నం" ద్వారా,రమేష్ బాబుని "సమ్రాట్" చిత్రం ద్వారా తెలుగు వెండి తెరకు పరిచయం చేశారు. ప్రముఖ దర్శకులైన కె.రాఘవేంద్ర రావు, కోదండ రామిరెడ్డి, పి.సి.రెడ్డి, శేఖర్, బోయిన సుబ్బారవు, వంశీ, శివ నాగేశ్వరరావు, మున్నగు వారు ఈయన దగ్గర శిష్యరికం చేసినవారే.విక్టరీ" నే యింటి పేరు చేసుకొన్న వి.మధుసూదన రావు గారు 1923 జులై 27 జన్మించి లో కృష్ణా జిల్లాలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలుకు వెళ్ళారు. ఆ తరువాత మద్రాసు వెళ్లి ఐ.ప్రసాద్, తాతినేని ప్రకాశరావు వంటి వారి పరిచయంతో సినీ రంగ ప్రవేశం చేశారు. అయన కె.ఎస్.ప్రకాశరావు వద్ద చలనచిత్రీకరణ పాఠాలు నేర్చుకొని, 1958 లో చదలవాడ కుటుంబరావు నిర్మించిన "సతీ తులసి" పౌరాణిక చిత్రానికి మొదటిసారిగా దర్శకత్వం వహించి, దర్శకుడయ్యారు. కమ్యూనిస్ట్ భావజాలం ఒంట పట్టించుకున్న ఆయనకు తొలి సినిమాగా 'సతీ తులసి' పౌరాణిక సినిమా దర్శకత్వ అవకాశం రావడం యాదృచ్ఛికమే అయినా, చిత్తశుద్ధితో, వృత్తి నిబద్దతతో కృషి చేసి, విజయం సాధించడం



విశేషం. ఆయన తీసిన ప్రతీ భక్తి రస ప్రధాన పౌరాణిక చిత్రాలు ఘనవిజయం సాధించడం ఆయన అంకితభావానికి నిదర్శనం. ఆ తరువాత వి.బి.రాజేంద్ర గారి "జగపతి" వారి "అన్నపూర్ణ" సినిమాకు దర్శకత్వం వహించగా అది 100 రోజులు నడిచి విజయవంత మయింది. ఒక దశలో జగపతి సంస్థకు మధుసూదనరావు గారే రెగ్యులర్ దర్శకుడు. మద్రాసు నుండి హైదరాబాద్ వచ్చి మధు ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ స్థాపించి ఎంతో మందిని నటులుగా తీర్చి దిద్దారు. 1964 లో తనతో పాటు ప్రజా నాట్య మండలిలో పనిచేసిన సరోజినిని ఆదర్శాలకు కట్టుబడి వివాహం చేసుకున్నారు. ఆమె తరువాత పూర్తిగా మహిళలతో సినిమా తీసి గిన్నిస్ రికార్డుకి ఎక్కారు. తెలుగు చలన చిత్ర సీమలో 50 సంవత్సరాలుగా కొనసాగుతూ నాలుగు భాషలలో కలిపి 71 చిత్రాలకు దర్శకత్వం వహించి "వీరమాచనేని"కి బదులు "విక్టరీ" నే ఇంటి పేరుగా చేసుకున్నారు. రక్తసంబంధం, ఆరాధన, ఆత్మబలం, గుడిగంటలు, మంచి కుటుంబం, లక్ష్మీ నివాసం, కళ్యాణ మంటపం, మంచి రోజులు వచ్చాయి, కృష్ణవేణి, జేబుదొంగ, చక్రధారి, ఎదురీత, విచిత్ర జీవితం, అంగడిబొమ్మ, మల్లెపూవు, శివమెత్తిన సత్యం, సంసారం, సంతానం, విక్రమ్, సామ్రాట్ , ప్రాణ స్నేహితులు, ఆత్మకథ, సింహస్వప్నం, పాపే మా ప్రాణం లాంటి 23 సినిమాలు రీమేక్ చేయగా, అన్ని విజయ వంతం కావడం గమనార్హం. నవలలని సినిమాలుగా మలిచి ప్రజాదరణ పొందడంలో అందెవేసిన చేయిగా ఖ్యాతిని ఆర్జించారు. సతీ తులసి (1959), వీరాభిమన్యు (1965), ట్యాక్సీ రాముడు (1961), ఆరాధన (1962), పదండి ముందుకు (1962), రక్త సంబంధం (1962), లక్షాధికారి (1963), ఆత్మ బలం (1964), అంతస్థులు (1965), గుడి గంటలు (1965), మంచి కుటుంబం (1965), ఆస్తి పాస్తులు (1966), డ్రైవర్ ఆనంద్ (1966), జమీందార్ (1966), లక్ష్మీ నివాసం (1968), అదృష్ట వంతులు (1968), ఆత్మీయులు (1969), మనుషులు మారాలి (1969), లవ్ కుశ్ (హిందీ), దేవి (1970), సమాజ్ కొ బదల్ డాలో (1970)), కళ్యాణ మండపం (1971), మంచి రోజు లొస్తాయి (1972), కన్న కొడుకు (1973), భక్త తుకారాం (1973), కృష్ణవేణి (1974), ప్రేమలు పెళ్ళిళ్ళు (1974), జేబు దొంగ (1975), చక్రధారి (1977), ఎదురీత (1977), ఈ తరం మనిషి (1977), అంగడి బొమ్మ (1978), మల్లెపూవు (1978), జూదగాడు (1979), శివమెత్తిన సత్యం (1979), ఛండీ ప్రియ (1980), జీవిత రథం (1981), పులి బిడ్డ (1981), బంగారు కానుక (1982), విక్రమ్ (1986), సామ్రాట్ (1987), కృష్ణగారి అబ్బాయి (1989) తదితర చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఆయన తన 95వ ఏట, 2012 జనవరి 11న అనారోగ్యంతో మరణించారు.

# శాస్త్రి మృతిపై తీరని సందేహాలు

భారత దేశ మలి ప్రధాని, స్వాతంత్ర్యోద్యమం లో ప్రముఖ పాత్రధారి, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడు, జై జవాన్ జై కిసాన్ నినాదంతో ప్రజల అభిమానాన్ని చూరగొన్న లాల్ బహదూర్ శాస్త్రి మరణంపై సందేహాలు తీరనే లేదు. తాష్కెంట్లో అతను గుండెపోటుతో మరణించినట్లు చెప్పబడినా, అది ప్రణాళికా బద్ధమైన హత్యగా చర్చకు తెర లేపింది. 1965 ఆగస్టులో, పాకిస్తాన్ తన సేనలను ప్రయోగించి జమ్మూ కాశ్మీరులోని కచ్ ప్రాంతాన్ని ఆక్రమించుకుంది. తద్వారా జమ్ము కాష్మీరులోని ప్రజలు ఉద్యమించి, భారతదేశం నుండి విడిపోతారని ఆశించింది. పాకిస్తాన్ ఆక్రమణ గురించి తెలుసుకున్న లాల్ బహదూర్ శాస్త్రి వెంటనే త్రివిధ దళాలకు నియంత్రణ రేఖను దాటి లాహోరును ఆక్రమించు కోవడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. భారత సైన్యం విజయానికి చేరువలో ఉండగా శాస్త్రి పై అమెరికా తీవ్ర ఒత్తిళ్లు తెచ్చింది. 1965 యుద్ధం తీవ్రస్థాయికి చేరిన సమయంలో పాకిస్థాన్- అమెరికా, భారత్- అమెరికా మధ్య జరిగిన పలు దౌత్య కార్యక్రమాలు జరిగాయి. యుద్ధంలో పాక్ ఓటమి దశకు చేరిన సమయంలో నాటి పాక్ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, విదేశాంగమంత్రి జుల్ఫీకర్ అలీ భుట్టోలను పాక్‌లో అమెరికా రాయబారి వాల్టర్ ప్యాట్రిక్ మెక్‌కోటే కలిసి యుద్ధ విరమణకోసం చర్చలు జరిపారు. ఈ దశలో ఐక్యరాజ్య సమితి పాక్‌తో విరమణ ఒప్పందాన్ని ప్రతిపాదించింది. ఈ దశలో ఒప్పందానికి అంగీకరించే విధంగా శాస్త్రిపై తాష్కెంట్‌లో తీవ్ర ఒత్తిళ్లు వచ్చాయన్న ఆరోపణలు ఉన్నాయి. 1965 లో పాకిస్తాన్తో కాల్పుల విరమణ ప్రకటించిన తరువాత, శాస్త్రి, అయుబ్ ఖాన్ తాష్కెంట్ లో జరిగిన ఒక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్నారు. 1966 జనవరి 10న ఒప్పందాలపై సంతకాలు చేసిన మర్నాడే జనవరి 11న ఆయన హృద్రోగంతో అక్కడే మృతి చెందాడు. ఓ దేశాధినేత అదీ మరో దేశానికి అతిథిగా ఒప్పందాలపై సంతకాలు చేసేందుకు వెళ్ళి అక్కడే అసహజ, అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం చరిత్రలో అంతకు ముందెప్పుడూ లేదు. ఈ మరణం హృద్రోగం వల్ల సంభవించిందని సోవియట్ ప్రభుత్వం ప్రకటించింది. భారత ప్రభుత్వం దీన్నే ధ్రువీకరించింది. అనుమానాలు వ్యక్తం అయినా శాస్త్రి భౌతిక ఖాయానికి పోస్టుమార్టం నిర్వహించ లేదు. అంతకు ముందెప్పుడూ శాస్త్రికి ఎలాంటి అనారోగ్యం లేదు. విషప్రయోగం వల్లే శాస్త్రి మరణించారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. శాస్త్రి ఆఖరుగా ఆయన కుమార్తె సుమన్‌తో మాట్లాడాడు. పాలుతాగి పడుకుంటానని చెప్పాడు. ఈలోగా ఫోన్‌లైన్ డిస్కనెక్ట్ అయింది. తర్వాత దాదాపు పదిహేను నిమిషాలకు పైగా సుమన్ లైన్ కోసం ప్రయత్నించింది. ఆ తర్వాత లైన్ దొరికింది కానీ శాస్త్రి ఎత్తలేదు. సోవియట్‌కు చెందిన ఓ అధికారి ఫోన్ ఎత్తాడు. మీ తండ్రిగారు ఇప్పుడే మరణించారని సుమన్‌కు చెప్పాడు. అంతవరకు ఎలాంటి అరోగ్యకర ఇబ్బందుల్లేని వ్యక్తి 15 నిమిషాల్లో మృతి చెందినట్లు చెప్పాదంపై సందేహాలు ఇప్పటికీ వెంటాడుతూనే ఉన్నాయి. శాస్త్రి వెంట ఆయన వ్యక్తిగత వైద్యుడు ఆర్ఎన్ చుగ్ కూడా తాష్కంట్ వెళ్ళాడు. అతనూ పక్కగదిలోనే ఉన్నా, కనీసం శాస్త్రికి గుండెపోటు వచ్చిందన్న విషయాన్ని ఆయనకు కూడా సోవియట్ అధికారులు వెల్లడించలేదు. మరణించిన తర్వాతే ఆ విషయాన్ని చెప్పారు. భారత్‌కు తెచ్చిన శాస్త్రి భౌతిక కాయం నీలంరంగులోకి మారి ఉంది. శరీరంపై కొన్ని



గాట్లు కూడా గమనించినట్లు ఆయన భార్య లలితాశాస్త్రి గుర్తించారు. శాస్త్రి విష ప్రయోగం వల్ల మరణించాడని ఆయన భార్య లలితా శాస్త్రి ఆరోపించింది. 1978 లో క్రాంత్ ఎం.ఎల్.వెర్మా హిందీలో "లలితా కె ఆంసు" పేరుతో పుస్తకాన్ని రాసి ప్రచురించాడు. ఈ పుస్తకంలో శాస్త్రి మరణం గురించి విషాద కథ లలిత శాస్త్రిచే వ్యాఖ్యానించ బడింది. ఆయన మరణం చుట్టూ ఇప్పటికీ సందేహాలు ఉన్నాయి. ఆయన కుమారుడు సునీల్ శాస్త్రి,

తండ్రి మరణానికి వెనుక ఉన్న మర్మాన్ని తెలియ చేయ వలసినదిగా ప్రభుత్వాన్ని కోరాడు. 1966 లో ఆయన మరణం తరువాత భారత దేశానికి తీసుకువచ్చిన భౌతిక కాయంపై నీలం రంగు మచ్చలు, కొన్ని గాట్లు ఉన్నట్లు అనుమానాలను వ్యక్త పరిచాడు. పోస్టు మార్టం చేయ బడనప్పటికీ శరీరంపై గాట్లు ఏర్పడానికి కారణాన్ని గూర్చి అడిగాడు. శాస్త్రి మనవడు సంజయ్... తమ తాతకు తాష్కెంట్‌లో హోటల్ బుక్ చేయాలనుకుని, ఆయనకు సోవియట్ ప్రభుత్వం ఒక కాటేజ్ కేటాయించిందని, అందులో టెలీప్రింటర్, టెలిఫోన్ కూడా లేవని పేర్కొన్నారు. మృతదేహం దిల్లీకి వచ్చినప్పుడు చూస్తే ఆయన నోరు, ముక్కు నుంచి రక్తం కారడం కనిపించిందని, ఆయన ఒంటిపై గాట్లు ఉన్నాయని, అమ్మమ్మ నెయ్యిలో ఆయన చేతులను ముంచిం పెదాలకు నెయ్యి పూస్తే నెయ్యి నీలిరంగులో కనిపించిందని, ఆయన వ్యక్తిగత డైరీ, ఆయన రోజువారి కార్యక్రమాలను రాసుకొనే యాక్షన్ ప్లాన్ పుస్తకం కనిపించలేదని సంజయ్ ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. 1977లో శాస్త్రి మరణంపై దర్యాప్తుకు ఓ కమిటీని నియమించారు. ఈ కమిటీ ముందు వాంగ్మూలం ఇచ్చేందుకు డాక్టర్ చుగ్ బయలు దేరాడు. కారులో ఢిల్లీ వైపు ప్రయాణిస్తుండగా ఎదురుగా ఓ లారీ వచ్చి ఢీ కొనగా, చుగ్ అక్కడి కక్కడే మరణించాడు. అలాగే శాస్త్రి వ్యక్తిగత సేవకుడు రామ్‌నాథ్ కూడా ఆయనతో పాటు తాష్కంట్ వెళ్ళాడు. మృతదేహం వెంటే ఆయనా తిరిగొచ్చాడు. ఆయనను కూడా కమిటీ సాక్షిగా పరిగణించింది. వాంగ్మూలం నమోదుకు పిల్చింది. మోతీలాల్ నెహ్రూ మార్గ్‌లోని తన నివాసం నుంచి ఆయన ఒక్కడుగు బయట కేయగానే ఎదురుగా ఓ వాహనం వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రామ్‌నాథ్ రెండుకాళ్ళూ నుజ్జునుజ్జు అయ్యాయి. తలకు బలమైన గాయాలయ్యాయి. ఆయన గతాన్ని మర్చిపోయాడు. తాష్కెంట్ ఒప్పందం గూర్చి శాస్త్రి రష్యా వెళ్ళిన తరువాత పాకిస్థాన్ అధ్యక్షుడు ఆయూబ్ ఖాన్ నుండి పాకిస్థాన్ భవిష్యత్తులో భారత్ పై బలగాలను ఎప్పుడూ ప్రయోగించ రాదనే వాగ్దానాన్ని కోరాడు. కానీ చర్చలు కొనసాగలేదు. తరువాత రోజు శాస్త్రి మరణించాడు. భారత ప్రభుత్వం ఆయన మరణం గురించి ఎటువంటి సమాచారం అందించలేదు. భారత దేశంలో ఈ కుట్ర జరిగే సాధ్యాసాధ్యాలను "అవుట్ లుక్ మ్యాగజైన్" ప్రచురించింది. 2009లో దక్షిణాసియాపై సిఐఎ దృష్టి పేరిట అనుజ్‌ధార్ అనే రచయిత పుస్తకం రాసేందుకు ఉపక్రమించాడు. ఇందుకోసం శాస్త్రి మరణానికి సంబంధించిన పత్రాలు కావాలంటూ సమాచార హక్కు చట్టం క్రింద భారత ప్రధాని కార్యాలయానికి దరఖాస్తు చేసుకున్నాడు. వీటి జారీకి పిఎమ్ఓ నిరాకరించింది. పైగా ఈ పత్రాల జారీ భారత సార్వభౌమత్వానికి, అంతర్గత భద్రతకు, ఆర్థిక ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుందని పేర్కొన్నారు. సిఐఎ ప్రమేయాన్ని కూడా తక్కువగా అంచనా వేయలేం. పైగా ఆ సమయంలో సిఐఎలో డైరెక్టర్ ఆఫ్ ప్లాన్స్‌గా ఉన్న రోబర్ట్ క్రోలీ అమెరికాకు చెందిన గ్రిగరీడగ్లస్ అనే జర్నలిస్ట్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ శాస్త్రితో పాటు భారత అణు పితామహుడు డాక్టర్ హోమీబాబా మరణాలకు సిఐఎ ప్రణాళికలు రచించి అమలు చేసిందని వెల్లడించారు. అయితే తన మరణానంతరమే ఈ ఇంటర్వ్యూను ప్రచురించాలని ఆయన డగ్లస్‌ను కోరాడు. శాస్త్రి, హోమీబాబా మరణాలు ఒకే నెలలో జరిగాయి. రెండింటికి మధ్య రెండు వారాల వ్యవధే ఉంది. పైగా ఈ రెండు దేశానికి వెలుపలే చోటు చేసుకున్నాయి. 60వ దశకంలో అమెరికాకు సహకరించని వివిధ దేశాల నేతల్ని హతమార్చడం సిఐఎ పనిగా పెట్టుకుంది. దీనిపై కేంద్రం రాజ్‌నారాయణ్ కమిటీని నియమించింది. ఈ కమిటీ అధ్యయనం నివేదిక ఇప్పటివరకు వెలుగు చూడలేదు. ఆఖరికి ఇది భారత పార్లమెంట్ లైబ్రరీలో కూడా అందుబాటులో లేదు.

# రైతులకు శాపంగా మారిన బ్రిక్స్ ఇండస్ట్రీ

- ఇండస్ట్రీ దుమ్ము - ధూళి వల్ల పంట నష్టపోతున్న రైతులు
- లబోదిబోమంటున్న పత్తి, కంది రైతులు




**అగ్నిధార న్యూస్ మంథని** :పెద్దపల్లి జిల్లా మంథని మండలం దంతలపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కొంజర్ల ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మ్యానుఫ్యాక్చర్ బ్రిక్స్ ఇండస్ట్రీ వల్ల తమ పంటలు దెబ్బతింటున్నాయని దంతలపల్లె రైతులు లబోదిబో మంటున్నారు. దంతలపల్లి ఊరును పంట పొలాలను అనుకొని ఉన్న బ్రిక్స్ ఇండస్ట్రీ దుమ్ము వల్ల పత్తి, కంది పంటలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. పండించిన పత్తి పంట దుమ్ము వల్ల రంగు మారి అమ్ముకోలేని పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ప్రతి ఏటా ఇదే పరిస్థితిని ఎదుర్కొని గిట్టుబాటు ధర రాక అప్పుల్లో కూరుకు పోతున్నామని కన్నీళ్ళ పర్యంతం అవుతున్నారు. బ్రిక్స్ ఇండస్ట్రీ యజమానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్న పెడచెవిన పెడుతున్నారని అంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు బ్రిక్స్ ఇండస్ట్రీ వల్ల రైతులకు జరుగుతున్న నష్టాన్ని క్షేత్రస్థాయిలో పర్యటించి, పరిశీలించి తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# భక్తులతో కిటకిటలాడిన శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయం



**ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనం ఇచ్చిన శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి**

**అగ్నిధార న్యూస్ మంథని :** వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం స్థాయిగా శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయంలో భక్తులు ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకుని పునీతులయ్యారు. అత్యంత పవిత్రమైన వైకుంఠ ఏకాదశి రోజున స్వామివారిని దర్శించుకుంటే అంతా శుభం జరుగుతుంది అని భక్తుల్లో ప్రధాన విశ్వాసం నెలకొంది. తెల్లవారుజామున నాలుగు గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉత్తర వద్ద స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. పుష్య మాసము శుక్ర పక్షము సందర్భంగా నెల రోజులపాటు శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అలాగే పట్టణంలోని గోదావరి నది తీరంలో భక్తులు పుణ్య స్నానం ఆచరించారు. అనంతరం శ్రీ గౌతమేశ్వర స్వామి, శ్రీ కోదండ రామాలయం, శ్రీ బాల సరస్వతి, శ్రీ రామలింగేశ్వర స్వామి, శ్రీ హనుమాన్ దేవాలయాల్లో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# రంగవల్లులు సాంప్రదాయానికి ప్రతీకలు



**అనూస్ పాఠశాల డైరెక్టర్ లు అరుణ వెంగల్ రెడ్డి, స్వాతి రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా** :భారతీయ పండుగలు వాటి విశిష్టతలను భావితరాలకు తెలిసే విధంగా ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు అనూస్ పాఠశాల డైరెక్టర్లు అరుణ, స్వాతి రెడ్డిలు అన్నారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా వనపర్తి పట్టణంలోని అనూస్ పాఠశాలలో విద్యార్థినిలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో పాల్గొన్న విద్యార్థినిలను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగవల్లులు సాంప్రదాయానికి ప్రతీకలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# ఆల్ ఇండియా పీజీ ర్యాంక్ సాధించిన కోషిక పవన్ కు సన్మానం



**ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్ నాయక్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** ఆల్ ఇండియాలో పోస్ట్ గ్రాడ్యుయేట్ లో 29 వేల ర్యాంకు సాధించిన కడ్తాల్ గ్రామానికి చెందిన కోషిక జంగయ్య అరుణ దంపతుల కుమారుడు కోషిక పవన్ ను లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ ఘనంగా సన్మానించారు. ఆల్ ఇండియా పీజీలో 29వేల ర్యాంకు సాధించి ఖమ్మం జిల్లాలోని మమతా మెడికల్ కాలేజీలో సీటు సంపాదించుకున్నందుకు పవన్ ను అభినందించారు. పవన్ ర్యాంకు సాధించడం వెనకాల తల్లిదండ్రుల అపార కృషి ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో, మాజీ సర్పంచ్ హరిచంద్ నాయక్ డైరెక్టర్ జోగు వీరయ్య సేవ్య నాయక్ కోటియా టిక్ లాల్ నరేందర్ శంకర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బాలికల కళాశాలలో ఘనంగా రంగవల్లుల పోటీలు



**అగ్నిధార న్యూస్ మంథని :** సంక్రాంతి పండగను పురస్కరించుకుని మంథని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థినీలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. శనివారం నుండి కళాశాలకు సంక్రాంతి పండగ సెలవులు ఉండటంతో ముందస్తుగా ముగ్గుల పోటీలు చేపట్టారు. కళాశాల ఆవరణలో పలు రంగులతో వివిధ ఆకృతుల్లో వేసిన రంగవల్లులు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పోటీలో గెలిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** : నేడు 11- 01-25 శనివారం రోజు ఉదయం 11:00 గ.లకు తలకొండపల్లి మండలం లో అభి వృద్ధి కార్యక్రమం తో పాటు చుక్క పూర్ గ్రామానికి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి కల్వకుర్తి శాసన సభ్యులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొనడం జరుగుతుంది అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి తెలిపారు తలకొండపల్లి మండల%శీ% కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు యువజన కాంగ్రెస్,మరియు ఎన్ ఎస్ యు ఐ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

# పేద ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరం



**డాక్టర్ యశోద బాయి ఎం బి బి ఎస్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కల్వకుర్తి మండలం తర్నికల్ తండాలో మహిత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కల్వకుర్తి వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది ఈ శిబిరంలో దాదాపుగా 252 మందికి వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా వైద్య సేవ చేయడమే మా లక్ష్యం అని కన్సల్టెంట్ సర్జన్ డాక్టర్, కె యశోద బాయి ఎం బి బి ఎస్ ఎం ఎస్,డాక్టర్ సురేష్, క్రిటికల్ కేర్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది షేక్ ఏజాస్,కిరణ్ హాస్పిటల్ సిబ్బంది, ప్రేమ్, అజహర్, శివ, నరేష్, కర్ణాకర్, సాయి, హరి, తులసిరామ్, సాయి కృష్ణ, నాను, గీత ,మేరీ, దామిని,గ్రామ మాజీ సర్పంచ్ లు సోమ్లా నాయక్, ఆర్ రాజు, వార్డు సభ్యులు గుండియా నాయక్, లక్ష్మణ్ నాయక్, సక్రు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# మఠంవీధి పాఠశాలకు పూర్వ విద్యార్థుల టీవీ వితరణ




**అగ్నిధార న్యూస్ మంథని :** మంథని పట్టణంలోని మఠం వీధి మండల ప్రజా పరిషత్ పాఠశాలకు పూర్వ విద్యార్థులు మారుపాక సత్యనారాయణ, రాంపల్లి మారుతి, చెరుకు శ్రీరామ్ రెడ్డి, గట్టు నాగన్న ,దుద్దిళ్ళ రామారావ్, చిల్లప్పగారి నారాయణ, ఇంటర్ -1972 బ్యాచ్ వారి సౌజన్యంతో బ్లూ స్టార్ వాటర్ ఫిల్టర్, సాంసంగ్ టెలివిజన్ ను శుక్రవారం బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తాము విద్యాబుద్ధులు నేర్చిన పాఠశాలకు ఇన్నేళ్లకు తిరిగి వచ్చి మా చేతుల మీదుగా చిన్నపాటి సహాయం చేయడం ఆనందంగా ఉందని అన్నారు.

# జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితని కలిసిన ధార మోని గణేష్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** : నిజామాబాద్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ని హైదరాబాదులోని వారి నివాసంలోమర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ జాగృతి నాయకులు బిఆర్ఎస్వి కల్వకుర్తి అధ్యక్షుడు దారమోని గణేష్. ఈ కార్యక్రమంలో, జాగృతి జిల్లా నాయకుడు అనిల్ పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**అగ్నిధార న్యూస్ మంథని :** శనివారం ఉదయం 09:00 గంటల నుండి 11:00 గంటల వరకు మంథని, గుంజపడుగు, నాగారం విద్యుత్ ఉప కేంద్రములో విద్యుత్ నిలిపి వేయబడునని మంథని విద్యుత్ ఏఈ ఒక ప్రకటనలో తెలియజేశారు. విద్యుత్ ఉపకేంద్రం అత్యవసర మరమ్మత్తుల దృష్టా విద్యుత్ ఉప కేంద్రము పరిదిలో విద్యుత్ సరఫరా ఉండదని తెలియజేశారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# నియోజక వర్గం అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీతో సాధ్యం

**ర్యాలీల పేరుతో ఉనికి పొందడానికి బిఆర్ఎస్ ప్రయత్నలు**

**తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** : కల్వకుర్తి నియోజకవర్గం అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా సాధ్యం అవుతుందని తల కొండపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో, నాగర్ కర్నూల్ పార్లమెంట్,మరియు అసెంబ్లీ స్థానాలలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎంపిలతో పాటు తెలంగాణలో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికి ఐదేండ్లుగా ప్రజలను మభ్యపెట్టి అభివృద్ధిని పట్టించుకోకుండ సొంత ప్రయోజనాలతో కాలయాపన చేసిన వారు నేడు రాజకీయ ఉనికి కాపాడుకోవడానికి ర్యాలీల పేరుతో ప్రజల దృష్టి మళ్ళించాలని చూసినా బిఆర్ఎస్ ను ప్రజలు విశ్వసించే స్థితిలో లేరు.అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి అన్నారు.కల్వకుర్తి నియోజకవర్గంలో ప్రస్తుత ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి నియోజక వర్గంలో కోట్ల రూపాయల నిధులతో అన్ని మండలాలలోనీ గ్రామాలకు బి టి రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ అభివృద్ధి తో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తుంటే జీర్ణించుకోని బిఆర్ఎస్ పార్టీ నాయకులు గతంలో మీ పార్టీ ఎమ్మెల్యే చెసిన అభివృద్ధి నామ మాత్రమని గుర్తించుకోవాలని తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని కల్వకుర్తి, తలకొండపల్లి, వెల్దండ, ఆమనగల్లు, కడ్తా ల్ %శ్రీ%మాడ్గుల మండలాలకు ఇచ్చిన హామీలు పూర్తి చేయలేక ఐదేండ్లు కాలయాపన చేసిన గత ఎమ్మెల్యే పదవీకాలం ముగిసే సమయంలో శిలాఫలకంతో అంతే కాకుండ మీ రాజకీయ ప్రయోజనాలకొరకు పేదలను పట్టించుకోకపోవడంతో అసెంబ్లి, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు మిమ్మల్ని మూడో స్థానానికి సరిపెట్టారని అన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తో పాటు,ఈ ప్రాంతానికే చెందిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సహకారంతో నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి అన్ని విధాలుగా సహకరించడం జరుగుతుందని ఇకనైనా బిఆర్ఎస్ నాయకులు ప్రజలను మభ్యపెట్టడం మానుకొని కాంగ్రెస్ ప్రభుత్వ%శీ% చేస్తున్న అభివృద్ధి కి సహకరించాలని కోరారు.

# క్రీడా కారులు జాతీయ స్థాయిలో రాణించాలి

## ఎల్ ఎచ్ పి రాష్ట్ర ఉపా అద్యక్షుడు కడ్తాల్ మాజీ జెడ్పీటీసీ దశరథ్ నాయక్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** కడ్తాల్ మండలంలోని సలార్పూర్ గ్రామ పంచాయతీలో సాలార్పూర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా దశరథ్ నాయక్ మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా గ్రామీణ యువత క్రీడలలో జాతీయ స్థాయి లో రాణించాలని ఆయన అన్నారు.క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం సంతోషకరమని అలాగే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా టోర్నమెంట్ నిర్వాహకులు విజయవంతంగా టోర్నమెంట్ను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో, మాజీ ఎంపిటిసి ప్రియా రమేష్, పంతు నాయక్, సాయిలు, నాయకులు బాబా ,జంగయ్య, కుమార్, నరేష్, క్రీడాకారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పేదింటి ఆడ బిడ్డ పెళ్లికి చేయూత



## ఉప్పల చారి ట్రబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తలకొండపల్లి మండలంలోని చంద్రధన గ్రామానికి చెందిన బుద్ధ సముద్రం అలివేలు కూతురు పెండ్లికి తెలంగాణ రాష్ట్ర బిఆర్ఎస్ నాయకులు మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ తన ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా కుటుంబానికి సహాయము అందజేశారు. ఇట్టి విషయాన్ని చంద్రదన గ్రామ స్థానిక బిఆర్ఎస్ నాయకులు గ్రామ మాజీ ఉపసర్పంచ్ సొల్లు సుధాకర్,మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి 1 (క్విం టాల్) బియ్యం తన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సహాయాన్ని అందజేశారు. కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్ కి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో,మాజీ ఉప సర్పంచ్ సొల్లు సుధాకర్, సొల్లు మల్లేష్, సొల్లు జగన్, సొల్లు పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా హెచ్ పి ఎల్ సీజన్ 2 క్రికెట్ పోటీలు ప్రారంభం



**అగ్ని ధార న్యూస్ గోపాలపేట వనపర్తి జిల్లా :**గోపాల్ పేట్ మండల కేంద్రంలో హనుమండ్ల గడ్డ ప్రీమియర్ లీగ్ సీజన్-2 క్రికెట్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. హనుమండ్ల గడ్డ కాలనీ పెద్దలు సంగనమోని బాలయ్య, కొంకలి వెంకటేష్, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, శరత్ బాబు లు క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు స్నేహ సంబం ధాలు పెంపొందుతాయన్నారు. యువత క్రీడలపై ఆసక్తి కనబరుస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగా లన్నారు. చెడు వ్యసనాలకు లోను కాకుం డాఆటలపై దృష్టి సారించాలని సూచించారు. టోర్నీ విజేతకు రూ.15 వేలు, రన్నర్ జట్టుకు రూ.10 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకి రూ. 5 వేల నగదుతోపాటు మెమెంటోలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ టోర్నీలో హనుమాన్ల గడ్డ లయన్స్, లెవెన్ వారియర్స్, హనుమాన్ల గడ్డ గేమ్ చేంజెర్స్, బెంగాల్ టైగర్స్, హనుమండ్ల గడ్డ ఐకాన్ స్టార్స్, ఫ్రాంచైజీలు పాల్గొన్నాయి. ప్రతిభగల క్రీడాకారు లను ప్రోత్సహించేందుకు ఇలాంటి టోర్నీలు దోహ దపడతాయన్నారు. అదేవిధంగా టోర్నమెంట్ నిర్వాహకులను కాలనీ పెద్దలు అభినందించారు.

# ప్రముఖ రంగస్థల కళాకారుడు మాలెల అంజిలయ్య మృతి



**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్ గండీడ్:**గండీడ్ మండలంలోని రుసుంపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, రంగస్థలం కళాకారుడు, జానపద గేయ రచయిత మాలెల అంజిలయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు.ఈయన మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేసి ఎంతోమంది విద్యార్థులని ఉన్నతంగా తీర్చిదిద్దాడు. అలాగే రంగస్థలం కళాకారుడిగా రాష్ట్రంలోని వివిధ పట్టణాల్లో నాటకాలు ప్రదర్శించి ప్రేక్షకుల మన్ననలు పొందారు . ఎన్నో అవార్డులు సొంతం చేసుకున్నారు. అంజిలయ్య మృతి పట్ల ఉపాధ్యాయులు, రంగస్థల కళాకారులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఇచ్చిన హామీ అమలు చేయాలి

## సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి) :** తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో, రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం కల్వకుర్తి నియోజకవర్గం లోని ఆశ వర్కర్లందరూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.

ఈ ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బి. ఆంజనేయులు మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఎన్నికల ముందు సెప్టెంబర్ లో 15 రోజులు సమ్మె చేశారని సందర్భంగా అదేవిధంగా ఫిబ్రవరి 9న జూలై 30న డిసెంబర్ 10న అనేక రూపాల్లో జరిగినటువంటి ఆందోళనల సందర్భంగా ఆరోగ్య శాఖ కమిషనర్ గారు ఇచ్చిన హామీలను అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆశ వర్కర్లు సమయపాలన లేకుండా నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజల ఆరోగ్యాలు కాపాడటం కోసం పనిచేస్తున్న వీరికి పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమైనాయని అన్నారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం మట్టి ఖర్చులు 50,000 వేలు, ఇన్సూరెన్స్ 50 లక్షలు ఆదివారం సెలవులు, పండుగ సెలవులు, నిర్ణయిస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని అదేవిధంగా ప్రసూతి సెలవులు కల్పించాలని అన్నారు. ఆశాలతో పారితోషికం లేని పనులు చేయించకూడదని



క్వాలిటీ యూనిఫార్మ్స్ ఎండాకాలం కాటన్ యూనిఫామ్స్ ఇవ్వాలని అన్నారు. డిసెంబర్లో రాష్ట్రవ్యాప్తంగా ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఆశ వర్కర్ల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి తెలంగాణ మొత్తం 33 జిల్లాల్లో సభలు నిర్వహించారని ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించాలని లేదంటే బడ్జెట్ సమావేశాల సందర్భంగా చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడతామని తెలిపారు. అనంతరం సమస్యలతో కూడినటువంటి వినతిపత్రాన్ని అసెంబ్లీలో ఆశాల సమస్యలపై మాట్లాడాలని ఎమ్మెల్యే తిరుపతి వెళ్ళినందున కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఆనంద్ కుమార్ కి అందజేశారు.ధర్నాకు కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పులిజాల పరుశురాములు, బహుజన నాయకులు కానుగుల జంగయ్య పాల్గొని మద్దతు తెలిపారు. కార్యక్రమంలో, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు స్వప్న జిల్లా నాయకురాలు రాఫికా సుల్తానా, చంద్రకళ, నర్మదా, సుభద్ర,వసంత, అనిత వివిధ మండలాలకు చెందిన సుజాత, విమల, మాధవి, కవిత, అనిత, అలివేలు, గౌరీ, నాగమణి ,గీతా తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు

**అగ్నిధారన్యూస్ వనపర్తి జిల్లా :** వైకుంఠ ఏకాదశి సందర్భంగా జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి తెల్లవారుజామునే భక్తులు చేరుకున్నారు వనపర్తి ఎమ్మెల్యే తుడిమేగారెడ్డి , తుడి శారదా రెడ్డి దంపతులు తెల్లవారుజామునదేవాలయానికి చేరుకొని ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం ద్వారా దర్శనముచేసుకున్నారు. అనంతరం శ్రీ వెంకటేశ్వర స్వామి పల్లకి సేవలో పాల్గొని స్వామివారి పల్లకి మోసారు. అనంతరం వెంకటేశ్వర స్వామి కళ్యాణం లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే దంపతులకు ఆలయ ప్రధాన అర్చకులు అయ్యలూరి రఘునాథం శర్మ, వేదపండితులు వారిని ఆశీర్వదించి, శేష వస్త్రాలు సమర్పించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మెగా రెడ్డి మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి సందర్భంగా వనపర్తి నియోజకవర్గ ప్రజలందరూ ఆయు రారోగ్యలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నామన్నారు. వైకుంఠ ఏకాదశి రోజు తెల్లవారుజామునే స్వామివారిని ఉత్తర ద్వారా దర్శనం చేసుకుంటే ఎంతో పుణ్యం





కలుగుతుందని ప్రజలందరూ ఉత్తర ద్వారా దర్శనం చేసుకోవాలని కోరారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం శోభాయ నంగాఅలంకరించారు. అనంతరం వారి శ్రీమతి శారద తో కలిసి శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని శ్రీ రంగనాథ స్వామి ఆలయాన్ని సందర్శించి ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, తిరుమల మహేష్, కౌన్సిలర్ అలేఖ్య తిరుమల్, ఎస్ ఎల్ ఎన్ రమేష్, యాపర్ల రామిరెడ్డి, సత్య శీలా రెడ్డి, వేలాదిభక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉత్తరద్వార దర్శనం మోక్షదాయకం



విఠలేశ్వర పాండురంగస్వామిని దర్శించుకున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** వైకుంఠ ఏకాదశి పర్వదిన పర్వదినం సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం మోక్షదాయకమని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. పట్టణ బ్రాహ్మణ వీధిలో ఉన్న విఠలేశ్వర పాండురంగస్వామిని వార్డు కౌన్సిలర్ బండారు.కృష్ణ ఆహ్వానం మేరకుమాజీ మంత్రి నిరంజన్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఉత్తరద్వారం దర్శనం మోక్షదాయకం అని ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండే విధంగా ఆశీర్వదించాలని పాండురంగ స్వామినీ వేడుకున్నారు.ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణ శర్మ,మురళీ శర్మ సాదరంగా ఆహ్వానం పలికి ఘనంగా సన్మానించారు. నిరంజన్ రెడ్డివెంట వాకిటిశ్రీధర్ నందిమల్ల.అశోక్,కె.మాణిక్యం, ఉంగ్లమ్. తిరుమల్,నాగన్న యాదవ్,చిట్యాల. రాము,డాక్టర్ డ్యానియల్,పి.శ్రీనివాసులు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాలి

## - మండల విద్యాధికారి రాజు నాయక్



**అగ్నిదార న్యూస్ మహమ్మదాబాద్:** మన సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని మండల విద్యాధికారి రాజు నాయక్ అన్నారు. శుక్రవారం మహమ్మదాబాద్ మండల పరిధిలోని నంచర్ల గేట్ లో గల శ్రీ అక్షర గ్రామర్ స్కూల్ ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు విద్యార్థులు వేసిన ముగ్గులను ఎంఈఓ రాజు నాయక్ , మరియు దేశాయిపల్లి మాజీ సర్పంచ్ రఘు యాదవ్, మరియు పాఠశాల కరస్పాండెంట్ ప్రహ్లాదరెడ్డి ,ఉపాధ్యాయులు ,పరిశీలన చేసి ప్రథమ బహుమతిగా మౌనిక, హిమబిందు. ఆరవ తరగతి.ద్వితీయ బహుమతిగా పల్లవి ,సాయిసుష్మిత, శివ హర్షిత. తృతీయ బహుమతిగా శ్రావ్య, విశ్వజ ,జ్ఞాన సీత. విద్యార్థి నీలు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎం ఈ ఓ రాజు నాయక్ ,దేశాయిపల్లి మాజీ సర్పంచ్ రఘు యాదవ్ , మాట్లాడుతూ. పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థులలో మన సాంస్కృతి, సాంప్రదాయాలు అలవడుతాయని అలాగే పిల్లల్లో సృజనాత్మకతతో పాటు పోటీ తత్వం పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజేందర్ రెడ్డి. ఉపాధ్యా యులు.నాగమణి. కృష్ణమ్మ. నాగ మనిషా, ప్రవళిక, సువర్ణ ,ప్యాసియోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# సేవకు గుర్తింపు.. డాక్టర్ ప్రధానం..





**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి :** అమెరికా దేశానికి చెందిన ప్రఖ్యాత విచువల్ యూనివర్సిటీ గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ ద్వారా తెలంగాణ రాష్ట్రానికి చెందిన పెద్దపల్లి జిల్లా కేంద్రానికి చెందిన మేకల మల్లేశం యాదవ్ న్యాయవాద విద్యను అభ్యసించి తన స్వయం శక్తితో అంచలంచెలుగా ఎదుగుతూ గత 40 సంవత్సరాలుగా న్యాయవాది వృత్తిలో ఉంటూ పలు సంస్థల ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పెద్దపల్లి జిల్లా అభివృద్ధి ఫోరం సంస్థను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగమేళాలను ఉపాధి చూపించడంలో మెడికల్ క్యాంపులను పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా లయన్స్ క్లబ్ రెడ్ క్రాస్ సొసైటీలతో అనుసంధానమై వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించిన సందర్భంగా సోషల్ సర్వీసులో వారి సేవ గుర్తించి వారికి గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ ద్వారా గౌరవ డాక్టరేటను తమిళనాడు రాష్ట్ర రాజధాని మద్రాస్ నగరంలో రాజ అన్నమలై మంద్రం నందు యూనివర్సిటీ చైర్మన్ డా. పి. మాన్యువల్, వైస్ చాన్సలర్ రిటైర్డ్ తమిళనాడు హైకోర్టు జడ్జి డా . కె . వెంకటేశన్ చేతుల మీదుగా అందుకోవడం జరిగింది.

# పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలి

## రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ

**అగ్నిధార న్యూస్మహమ్మదాబాద్/గండీడ్బీ** మండల కేంద్రంలో శుక్రవారం టి.ఎస్.సి.పి.ఎస్.ఈ.యు ఆధ్వర్యంలో కార్పొరేట్ ల కడుపు నింపటానికే యుపిఎస్ విధానం%ొ

%ఈ నెల 12 నాడు జరిగే రాష్ట్ర ఈసి మీటింగ్ లో యుపిఎస్ పైన ఉద్యమకారచరణ ప్రకటిస్తాం%ొ %యుపిఎస్ విధానాన్ని అడ్డుకోవాలంటే ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సిందే అని రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ అన్నారు.ఈ సందర్భంగా గండీడ్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్యల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం స్థితప్రజ్ఞ మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు ఉపయుక్తకరమైన సమాచారంతో క్యాలెండర్ రూపొందించారని మండల కార్యవర్గాన్ని కొనియాడారు%ొ

%ఉద్యోగి కాంట్రిబ్యూషన్ లేని పాత పెన్షన్ విధానాన్ని మాత్రమే మేము కోరుకుంటున్నామని ఉద్యోగి కాంట్రిబ్యూషన్ తో కొనుగోలు చేసుకునే పింఛను విధానాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని,దేశ వ్యాప్తంగా ప్రతినెలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల నుండి కోట్ల రూపాయల సొమ్మును కార్పోరేట్లుకు అప్పనంగా అప్పగిస్తూ పెట్టుబడిదారీ వ్యవస్థను పెంచి పోషిస్తూ ఎలాంటి గ్యారెంటీ లేని స్కీమ్ లతో ప్రభుత్వ ఉద్యోగులను మోసం చేయడం సరికాదని గతంలో మాదిరిగా ఉద్యోగులకు భద్రతతో కూడిన 1980 పెన్షన్ రూల్స్ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.ఇట్టి కార్యక్రమంలో టి.ఎస్.సి.పి.ఎస్.ఈ.యు రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం స్థితప్రజ్ఞ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వాల్ శ్రీకాంత్, గండీడ్ మండల తహశీల్దార్ శ్రీమతి నాగలక్ష్మి , ఎంపిడిఓ దేవన్న, మండల విద్యాధికారి ఆర్. జనార్ధన్,డిప్యూటీ తహశీల్దార్ మాధవి,జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బాలస్వామి, కె.యం. చంద్రకాంత్, రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ గడ్డం వెంకటేష్, మండల కోశాధికారి పి.అశోక్ బాబు,పిఆర్టీయు టిఎస్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎ.శ్రీనివాస్ రెడ్డి సి. కృష్ణయ్య,పిఆర్టీయు టిజి ప్రధాన కార్యదర్శి డి. సంజీవ రెడ్డి, మరియు మండలంలోని సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.




# ఆదివాసి కుటుంబాలకు పోలీసుల అండ

### ... వారి సంక్షేమమే పోలీసుల లక్ష్యం..
### విద్యాతోనే జీవితంలో ఏదైనా సాధ్యం...
### ఆదివాసీలు ఉన్నత విద్య అభ్యసించి ఉన్నత స్థాయిలో ఉండాలి
### : మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ ఐపిఎస్.,
### మేము ఉన్నాం మీకోసం అంటూ భరోసా కల్పిస్తూ అందరితో సహపంక్తి భోజనం చేసిన పోలీస్ అధికారులు

అగ్ని ధార న్యూస్,( రామగుండం): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి మంచిర్యాల జోన్ మాదారం పోలీస్ స్టేషన్ పరిధిలోణి నర్సాపూర్ (బెజ్జాల) గ్రామంలో తాండూర్ సర్కిల్ పోలీసువారి ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ వారి సహకారం తో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం లో భాగంగా పోలీస్ మీకోసం కార్యక్రమం శుక్రవారం నిర్వహించి ఆదివాసీ గిరిజన కుటుంబాలకు దుప్పట్లు, నిత్య అవసర సరుకుల, వంట సామాగ్రి, చీరలు, దోతులు, లుంగీల పంపిణి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ ఐపిఎస్., బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ హాజరైనారు. వారిని ప్రజలు వారి సంప్రదాయ డప్పు వాయిద్యాలతో సంప్రదాయం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డిసీపీ మాట్లాడుతూ.... ప్రజల కోసమే పోలీసులు ఉన్నారని, ప్రజా శ్రేయస్సే పోలీసుల ధ్యేయం అన్నారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం ఎన్నో సౌకర్యాలు మెరుగు పడ్డాయని తల్లిదండ్రులు అందరూ తమ పిల్లలను చక్కగా చదివించుకుని ప్రభుత్వం ప్రవేశపెట్టిన సౌకర్యాలను సద్వినియొగం చేసుకోవాలన్నారు. పిల్లల ఉన్నత చదువుల కోసం ప్రభుత్వ హాస్టల్స్ కలవు అందులో చేర్పించి చదివించాలి. సెలువుల లో ఇంటికి వస్తే వారిని సెలవుల అనంతరం మళ్ళీ తిరిగి హాస్టల్ లకు తప్పక పంపించాలి అప్పుడే వారు మంచిగా చదువు కొని ఉద్యోగాలు సాధిస్తారు ఉన్నత స్థాయిలో ఉంటారు. గిరిజనుల శ్రేయస్సు కోసం పోలీస్ శాఖ ఎల్లవేళలా సంసిద్ధంగా ఉంటుందని తమ పిల్లలు చదువుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరుకుంటుందని, గిరిజనులకు ఎల్లవేళలా క్షేత్రస్థాయి పోలీస్ అధికారులు అందుబాటులో ఉండి వారికి ప్రతి విషయంలో తోడ్పాటును అందిస్తూ వారి ఉన్నతికి కృషిచేయాలని సూచించారు. గిరిజనులను విద్య, వైద్యం వంటి కనీస సౌకర్యాలు కల్పించి వారి ఉన్నతికి తోడ్పడడానికి పోలీస్ శాఖ ఎల్లవేళల సంసిద్ధంగా ఉంటుంది అని తెలిపారు. ప్రభుత్వం అందించే వివిధ లబ్ధి కార్యక్రమాలను గిరిజనులకు చేర వేయడానికి పోలీస్ శాఖ ప్రభుత్వం అన్ని శాఖల సమన్వయంతో సంసిద్ధంగా ఉందని అన్నారు. గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొన్ని సంఘ విద్రోహ శక్తులు వీరిని ప్రలోభాలకు గురిచేసి వీరిని చెడు మార్గం వైపు నడిచేలా ప్రోత్సహిస్తారు కావున వారి ప్రలోభాలకు లొంగకుండా మంచిని ఎంచుకుని సమాజ శ్రేయస్సుకు పాటు పడాలని సూచించారు. ఎటువంటి కష్టం వచ్చినా ఎల్లవేళలా పోలీస్ శాఖ వారికి అందుబాటులో ఉంటుందని వారు పోలీసులను సంప్రదించాలని సూచించారు . .ఆదివాసులు అసాంఘిక శక్తులకు దూరముగా ఉండాలని గ్రామాలలో ఎవరైనా అనుమానాస్పదంగా కొత్త వ్యక్తులు కనిపించిన, పోలిసులకు తెలియచేయాలని అభివృద్ధివైపు అదివాసులు దృష్టిసారించాలని మారుమూల గ్రామాలను సందర్శించి ప్రజలకు మరింత చైతన్య పరచాలని తెలిపారు. ముఖ్యంగా ఆదివాసి గిరిజన గ్రామాల్లో పర్యటించాలని, స్థానిక సమస్యలను తెలుసుకోని, వెంటనే పరిష్కరించే మార్గాన్ని అన్వేషించాలని సూచించారు. ప్రజలకు కేవలం శాంతిభద్రతల సమస్య కాకుండా ఇతర సమస్యలున్నా నిర్భయంగా పోలీస్ స్టేషన్కు వచ్చి తమ సమస్యలు వివరించి నట్లయితే వాటి పరిష్కారానికి తమ వంతుగా కృషి చేస్తామని ఇతర ప్రభుత్వ శాఖ ల సమన్వయం తో సమస్యల పరిష్కారం కు కృషి చేస్తాం అన్నారు.ఈ కార్యక్రమం లో బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, తాండూర్ సీఐ కుమార్ స్వామి, మాదారం ఎస్ఐ సౌజన్య, తాండూర్ ఎస్ఐ కిరణ్, పోలీస్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు,ప్రజలు, కుల పెద్దలు పాల్గొన్నారు.




# జడ్పీ హైస్కూల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు



### రామగుండం ప్రాంతాన్ని స్టడీ హబ్ గా ఏర్పాటు చేస్తా
### రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**అగ్నిధారన్యూస్ గోదావరిఖని :** రామగుండం: రామగుండం పారిశ్రామిక ప్రాంతాన్ని త్వరలో స్టడీ హబ్ గా ఏర్పాటు చేస్తానని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ అన్నారు. ఈ మేరకు రామగుండంలోని జడ్పీ హైస్కూల్ ఆవరణలో విద్యార్థులు, అధ్యాపక బృందంతో కలిసి ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలతో ఆట పాట, గాలిపటాలు ఎగురవేసి సందడి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రెండున్నర కోట్ల వ్యయంతో స్కూలు అందమైన భవనంగా ఏర్పాటు చేస్తామని, అదే క్రమంలోఎప్పటికప్పుడు విద్యార్థుల సంఖ్య పెంచాలని తల్లిదండ్రులకు,ఉపాధ్యాయులకు సూచించారు. గతంలో ఈ స్కూల్లో చదివిన విద్యార్థులు ప్రస్తుతం గొప్ప గొప్ప స్థాయిలలో ఉన్నారని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సర్కారు ఇప్పటికే అన్ని రకాల విద్యా అవకాశాలను కల్పించామన్నారు. మెడికల్ కాలేజీ తో పాటు నర్సింగ్, తదితర అదనపు కోర్సులను కూడా,తీసుకువస్తున్నామన్నారు. సంక్రాంతి సందర్భంగా ప్రత్యేకంగా వ్యవసాయం చేసే రైతులకు, రైతు కూలీలకు శుభాకాంక్షలు తెలియజేశారు.పంటలు సమృద్ధిగా పండి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని పేర్కొన్నారు. సమాజంలో ఉన్న చెడు ను ప్రారదోలి మంచిని ఆస్వాదించాలనిసూచించారు.ఈకార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ అజ్మీరా తో పాటు ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, టీచర్స్, తల్లి దండ్రులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ముగ్గురు నిరుపేద డైలసిస్ పేషెంట్స్ కీ 3నెలల పెన్సషన్ అందచేత



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం శాలగుండ్లపల్లి గ్రామం కి చెందిన కీ:శే: సంకుర్తులు ప్రభాకర్ 9వ వర్ధంతి సందర్భంగా వారి కూతురు స్థానిక ప్రభుత్వ జనరల్ అస్పత్రి ఉద్యోగి సంకుర్తుల విమల నీడ చేస్తున్న సేవలకీ మద్దతుగా 3 గురు స్థానిక నిరుపేద డైలసిస్ పేషెంట్స్, ఫాతిమా బేగం, ఎండీ దస్తగిరి, తిరుపతిలకి నీడ ఆరోగ్యామస్తు 521 రూపాయల పెన్సషన్ జనవరి నుండి మూడు నెలల పెన్సషన్ నీడ అధ్యక్షులు పల్లెర్ల రమేష్ గౌడ్ చేతుల మీదిగా అందచేశారు. ఈ సందర్భంగా నీడ అధ్యక్షులు పల్లెర్ల రమేష్ గౌడ్ మాట్లాడుతూ సంకుర్తుల విమల తన తండ్రి ప్రభాకర్ వర్ధంతి సందర్భంగా ముగ్గురు నిరుపేద పేషంట్లకి ఆర్థిక సాయం చేసి వారి తండ్రి పవిత్ర ఆత్మ తృప్తి చెందేలా చేసిన కుటుంబ సభ్యులను అభినందించారు. వీరిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు చేయాలని తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో సంకుర్తులు లక్ష్మి ,విమల తదితరులు పాల్గొన్నారు.

# జిడికె వన్ ఇంక్లైన్ చెక్ పోస్టు వద్ద లైట్లు ఏర్పాటు చేయండి.



### బొగ్గు కుప్పలను రోడ్డు మూల మలుపుల వద్ద డంపు చేయొద్దు.
### రాత్రి పూట వాహన దారులు ప్రమాదాలకు గురి కాకుండా చూడండి.
### సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్.

**అగ్నిధార న్యూస్,( రామగుండం):** సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని జిడికె వన్ ఇంక్లైన్ రైల్వే అండర్ బ్రిడ్జి నుండి వన్ ఇంక్లైన్ చెక్ పోస్టు రోడ్డు వరకు ఉన్న లైట్లు రాత్రు లందు సరిగా వెలగడం లేదని, వెంటనే ఎల్.ఇ.డి లైట్లు ఏర్పాటు చేసి వాహన దారులు ప్రమాదాలకు గురి కాకుండా చూడాలని సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్ ఒక ప్రకటన లో ఆర్జీ వన్ యాజమాన్యం ను కోరారు. అదేవిధంగా ఈ రోడ్డు మూల మలుపుల వద్ద బొగ్గు కుప్పలు ఉండడం వల్ల రాత్రి పూట భారీ వాహనాలు వచ్చేటివి ఏర్పడడం లేదని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, మూల మలుపుల వద్ద బొగ్గు కుప్పలు డంపు చేయకుండ చర్యలు తీసుకోవాలని, ఈ రోడ్డు మీదుగా గోదావరిఖని నుంచి వివిధ కాలనీ లలో ఉన్న కార్మికులు, ఉద్యోగులు వివిధ గనులకు తమ విధులను నిర్వహించేందుకు వెళ్తారని, అదేవిధంగా ముస్త్యాల, సుందిల్ల జనగామ గ్రామాల ప్రజలు తమ అవసరాల కోసం గోదావరిఖని కి వెళ్తారని ఆయన పేర్కొన్నారు. రాత్రి పూట వెళ్ళే వారు లైట్ లు లేక పోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, కనుక యాజమాన్యం స్పందించి ఎల్.ఇ.డి లైట్లు ఏర్పాటు చేసి ఈ రోడ్డు నుంచి వెళ్ళే వాహనదారులు, ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ఒక ప్రకటన లో కోరారు.

# పరిశోధనకు గుర్తింపు... డాక్టరేట్ ప్రధానం...







**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి :** అమెరికా దేశానికి చెందిన ప్రఖ్యాత విచువల్ యూనివర్సిటీ అయిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ ద్వారా తెలంగాణ రాష్ట్రం పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలానికి చెందిన మారం తిరుపతి యాదవ్ కి తెలంగాణ రాష్ట్రంలో గొర్రెల కాపరులు వారి స్థితిగతులు, ఆర్థిక ఎదుగుదల మాంస ఉత్పత్తిలో నూతన పద్ధతులపై గత 12 సంవత్సరాల నుండి పరిశోధన అధ్యయన%శీ% చేస్తున్న క్రమంలో ఆయనకు గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ ద్వారా గౌరవ డాక్టరేట్ ను శుక్రవారం రోజు తమిళనాడు రాష్ట్ర రాజధాని మద్రాస్ నగరంలో రాజ అన్నమలై మంద్రం నందు యూనివర్సిటీ చైర్మన్ డా. పి. మాన్యువల్, యూనివర్సిటీ వైస్ చాన్సలర్ రిటైర్డ్ తమిళనాడు హైకోర్టు జడ్జి డా . కె . వెంకటేశన్ చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయనకు పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

# జిల్లా బీజేపీ కౌన్సిల్ మెంబర్ గా విశ్వనాథ్,యాదవ్



**అగ్నిధార న్యూస్ (సంగారెడ్డి జిల్లా)** జహీరాబాద్ నియోజకవర్గ ము. 2002లో ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించి, ఏబీవీపీ నాయకునిగా విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ లో జిల్లా నాయకునిగా పనిచేసి 2013లో బిజెపిలో చేరి బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ గా బిజెపి జహీరాబాద్ మండల్ అధ్యక్షుడిగా అదేవిధంగా జెడ్పిటిసి గా పోటీ చేసి బిజెపి ఎదుగుదలకు తనవంతు కృషి చేసినందుకు బిజెపి సంగారెడ్డి జిల్లా కౌన్సిల్ నెంబర్ గా నియమించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూసంగారెడ్డి జిల్లా కౌన్సిల్ మెంబెర్ గా నియమంచి జిల్లా కమిటీలో అవకాశం కల్పించిన జిల్లా అధ్యక్షులు గోదావరి అంజి రెడ్డికి మాజీ ఎంపీ బి బి పాటిల్ కి ఢిల్లీ వసంత్, గొల్ల భాస్కర్ లు బీజేపీ జహిరాబాద్ నాయకులు జిల్లా, రాష్ట్ర నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ ఎదుగుదలకు కృషి చేస్తునని, ప్రజా సమస్యల నిరంతరం పోరాటం చేసి స్థానిక ఎన్నికలలో బీజేపీ తరుపున కార్యకర్తలు పోటీ చేసే విదంగా తను వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు.

# ముక్కోటి ఏకాదశి సందర్బంగా ప్రత్యేక పూజలు చేసిన సిపి



**అగ్నిధారన్యూస్ రామగుండం కమిషనరేట్ గోదావరిఖని :** ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పుర ఓస్కరిం చుకొని రామగుండం పోలీస్ కమీషన రేట్ మంచిర్యాల జోన్ మందమర్రి లోని పంచవ ఖఖి హనుమాన్ ఆలయం, వెంకటేశ్వర స్వామి ఆల యంకి చేరుకొన్న రామగుండం పోలీస్ కమి షనర్ శ్రీనివాస్, డిసిపి భాస్కర్ ఇతర పోలీస్ అధికారులు పూజారులు అనంత ఆచార్యులు, డింగరి కృష్ణకాంత్ చార్యులు, నరసింహ శాస్త్రి చార్యులు మంత్రోచ్చారణ నడుమ దర్శనం చేసుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సిపి, డిసిపిలను స్వామి వారి శేష వస్త్రాలతో ఆలయ పూజారులు, కమిటీ సభ్యుల ఘనంగాసన్మానించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అందరికి ముక్కోటి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. ఇబ్బంది లేకుండా దైవ దర్శనం కొరకు అన్ని ఆలయాల లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని భక్తులు అందరూ ప్రశాంతంగా క్యూ లైన్లు పాటిస్తూ దైవ దర్శనం చేసుకోనీ ప్రశాంతంగా వెళ్లాలని కోరారు. ప్రజలు అందరుప్రశాంత రగాలని, అందరిపై ఆ భగవంతుడి ఆశీస్సులు ఉండాలని అన్నారు.సీపీవెంట బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, మందమర్రి సీఐ శశి ధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్, తదితరులు ఉన్నారు.



# జిమ్‌లో గాయపడిన రష్మిక.. ఇప్పుడెలా ఉందంటే.?

నేషనల్ క్రష్ రష్మిక మందన్నాకి ప్రమాదం జరిగింది. రష్మిక జిమ్‌లో ఎక్సర్‌సైజ్ చేస్తుండగా.. కాలికి గాయం అయినట్లు సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. ఈ విషయంపై డాక్టర్‌ను కలువగా.. గాయం చిన్నదే అని.. పెద్దగా ప్రమాదం లేదని చెప్పినట్లు తెలుస్తుంది. అయితే ఒక వారం పాటు రెస్ట్ తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. దీంతో రష్మిక ప్రస్తుతం ఇంట్లో ఉండి రెస్ట్ తీసుకుంటున్నట్లు సమాచారం. ఇటీవలే పుష్ప 2 సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ భామ బ్లాక్ బస్టర్ హిట్‌ని అందుకుంది. ఇప్పటికే యానిమల్‌తో హిట్‌ని ఖాతాలో వేసుకున్న ఈ భామకి పుష్ప 2 తోడవడంతో రష్మిక రేంజ్ ఒక్కసారిగా పెరిగిపోయింది. మరోవైపు ఈ ఏడాది రష్మిక నటిస్తున్న చిత్రాలలో చావా సినిమా ఒకటి. విక్కీ కౌశల్ హీరోగా వస్తున్న ఈ సినిమా మహారాష్ట్ర యోధుడు ఛత్రపతి శివాజీ జీవిత చరిత్ర ఆధారంగా ఈ సినిమా రాబోతుంది. ఇదే కాకుండా సల్మాన్ ఖాన్ కథానాయకుడిగా వస్తున్న సికిందర్ చిత్రంలో కూడా కీలక పాత్రలో నటిస్తుంది ఈ భామ.

## డిటెక్టివ్‌గా మమ్ముట్టి

### 'డొమినిక్ అండ్ ది లేడీస్ పర్సు' ట్రైలర్ చూశారా.!

మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం డొమినిక్ అండ్ ది లేడీస్ పర్సు తమిళ అగ్ర దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. మమ్ముట్టి సొంత ప్రొడక్షన్ ఈ సినిమాను నిర్మిస్తుంది. ఇప్పటికే షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం రిపబ్లిక్ డే కానుకగా జనవరి 23న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలోనే మూవీ నుంచి ట్రైలర్‌ను వదిలారు మేకర్స్. ఈ మూవీ ట్రైలర్ చూస్తుంటే.. మమ్ముట్టి ఇందులో డొమినిక్ అనే డిటెక్టివ్ పాత్రలో నటించబోతున్నాడు. ఆసుపత్రిలో దొరికిన లేడీస్ పర్సుకి సంబంధించి ఈ కథ ఉండబోతున్నట్లు తెలుస్తుంది. తప్పిపోయిన ఆ లేడీస్ పర్స్ ఎవరిది అని డొమినిక్ కనిపెట్టాడా.. ఇంతకీ ఆ పర్స్‌లో ఏముంది.. ఈ పర్స్‌కి మర్డర్స్‌కి సంబంధం ఏంటి అనేది తెలియాలంటే ఈ సినిమా వచ్చేవరకు వెయిట్ చేయాల్సిందే. డా.నీరజ్ రాజన్ ఈ సినిమాకు కథను అందిస్తుండగా.. గోకుల్ సురేష్ , సుస్మితా భట్ , విజి వెంకటేష్ , వినీత్ , విజయ్ బాబు తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రలో నటించబోతున్నారు.





# బీచ్‌లో సూపర్ ఛిల్‌గా అలియాభట్

గ్లామరస్ రోల్స్‌తోపాటు నటనకు ఆస్కారమున్న పాత్రలు చేస్తూ నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారే భామల్లో టాప్‌లో ఉంటుంది బాలీవుడ్ హీరోయిన్ అలియాభట్ గతేడాది జిగ్రా సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ భామ ప్రస్తుతం రెండు సినిమాలతో బిజీగా ఉంది. కాగా ప్రొఫెషనల్‌గా బిజీగా ఉండే ఈ బ్యూటీ షూటింగ్ పనుల నుంచి బ్రేక్ తీసుకుంది. ప్రస్తుతం వెకేషన్ టూర్‌ను ఎంజాయ్ చేస్తోంది. ఈ భామ ఇంతకీ ఎక్కడికెళ్లిందో తెలుసా..? ప్రపంచ ప్రఖ్యాత టూరిజం స్పాట్స్‌లో ఒకటైన థాయ్‌లాండ్. బికినీలో థాయ్‌లాండ్ దీవుల్లోని సముద్రంలో జలకాలాడింది. సాగరతీరంలో విహరిస్తూ ప్రకృతిని అందాలను ఆస్వాదించింది. బ్లాక్ గాగుల్స్ పెట్టుకొని స్టైలిష్‌గా బోటు రైడ్ చేసింది. ఉదయాన్నే జిమ్ సెషన్‌కు వెళ్లింది. ఆ తర్వాత తనకిష్టమైన పుస్తకం చదివింది. అలియాభట్ థాయ్‌లాండ్ వెకేషన్‌లో సూపర్ ఛిల్ అవుట్ మూడ్‌లో ఉన్న ఫొటోలు ఇప్పుడు నెట్టింటిని షేక్ చేస్తున్నాయి. అలియాభట్ ప్రస్తుతం అల్ఫా, లవ్ అండ్ వార్ సినిమాల్లో నటిస్తుండగా.. చిత్రీకరణ దశలో ఉన్నాయి.




# రాయలసీమ నా అడ్డా..

### పవర్‌ఫుల్‌గా 'డాకు మహారాజ్' రిలీజ్ ట్రైలర్

నందమూరి బాలకృష్ణ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం డాకు మహారాజ్ 2023లో వాల్తేరు వీరయ్యతో బ్లాక్ బస్టర్ అందుకున్న బాబీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. శ్రద్ధ శ్రీనాథ్, పగ్యా జైశ్వల్ కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే మూవీ నుంచి రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఇప్పటికే మూవీ నుంచి ట్రైలర్‌ను పంచుకున్న విషయం తెలిసిందే. అయితే రిలీజ్ ట్రైలర్‌ను ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో లాంఛ్ చేద్దాం అనుకున్నారు. కానీ తిరుమల తొక్కిసలాట ఘటనలో భక్తులు మరణించడంతో ఈ వేడుకను వాయిదా వేశారు. దీంతో రిలీజ్ ట్రైలర్‌ను నేడు వదిలింది చిత్రబృందం.

# అతడిని అడవిలో వదిలేస్తే ఏం జరుగుతుంది?

### ఇంట్రెస్టింగ్‌గా ఆదిత్య ఓం బంధీ

లాహిరి లాహిరి లాహిరి సినిమాతో తొలిసారి సిల్వర్ స్క్రీన్‌పై మెరిశాడు ఆదిత్య ఓం ఆ తర్వాత తెలుగులో పలు చిత్రాల్లో నటించిన ఈ యాక్టర్ 2023లో నాతో నేను సినిమాలో కీలక పాత్రలో నటించాడు. 2024లో పాపులర్ టీవీ రియాలిటీ షో బిగ్ బాస్ సీజన్ 8లో కూడా సందడి చేశాడు. డైరెక్టర్ కమ్ ప్రొడ్యూసర్ కూడా అయిన ఈ నటుడు ప్రస్తుతం బంధీ సినిమాలో నటిస్తున్నాడు. ఈ మూవీలో ప్రకృతిని నాశనం చేస్తున్న కార్పొరేట్ కంపెనీలకు మద్దతుగా నిలిచే పాత్రలో ఆదిత్య ఓం కనిపించనున్నాడు. కార్పోరేట్ కంపెనీలకు న్యాయ సలహాదారుగా వ్యవహరించే పాత్రను పోషిస్తుండగా.. అతడిని అడవిలో వదిలేస్తే ఏం జరుగుతుంది..? అతడు ప్రకృతిని ఎలా కాపాడుతాడనే కాన్సెప్ట్‌తో సినిమా ఆసక్తికరంగా ఉండబోతుందని మేకర్స్ వెల్లడించారు. ఆదిత్య ఓం ఈ సినిమాలో ఎలాంటి డూప్స్ లేకుండా సొంతంగా యాక్షన్ సీక్వెన్స్‌లో కనిపించబోతున్నారని తెలియజేశారు. ఈ చిత్రానికి తిరుమల రఘు దర్శకత్వం వహిస్తున్నాడు. గల్లీ సినిమా బ్యానర్‌పై వెంకటేశ్వర్ రావు దగ్గు, తిరుమల రఘు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.



Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com